# బాల



పిల్లల సచిత్ర మాస పత్రిక



# బాల సంక్రాంతి సంచిక

## "BALA" SANKRANTI SPECIAL 1946

వస్తోంది! * వస్తోంది!!

బోగిపండుగ బాల — బొమ్మల్ల బాల
పెద్దపండుగ బాల — ముద్దుల్ల బాల
కనుమపండుగ బాల — కబురుల్ల బాల
జనవర్లో వస్తుంది — చదువర్ల బాల!

● ● ●

చిన్నారి పొన్నారి — చిత్రాల బాల
మాటల్ల పాటల్ల — నీతైన బాల
నవ్వుల్ల పువ్వుల్ల — నాట్యాల బాల
జనవర్లో వస్తుంది — చదువర్ల బాల!

● ● ●

రంగు రంగుల బాల — రతనాల బాల
వింత వింతల బాల — విద్దెల్ల బాల
హంగుపొంగుల బాల — అందాల బాల
జనవర్లో వస్తుంది — చదువర్ల బాల!

త్వరపడండి! * త్వరపడండి!!

మీకు 'బాల' కావలిస్తే మీ వూళ్లో 'బాల' ఏజంటుతో చెప్పండి
లేదా మా పేర ఉత్తరం ముందుగానే రాయండి.

సంచిక వెల **0-12-0** మాత్రమే!

వివరములకు:

మేనేజరు, "బాల"

20, సుందరేశ్వర్ వీధి, మైలాపూరు, మదరాసు.



నాగయ్య నటించు

# త్యాగయ్య

డైరెక్షన్ - నాగయ్య

తారాగణము :

లింగమూర్తి, దొరసామి, రాయప్రోలు, రాఘవన్, న్యాపతి, జయమ్మ, హేమలత, సరిత.

: డిస్ట్రిబ్యూటర్సు :

తమిళనాడు, బొంబాయిరాజధాని (మద్రాసుతప్ప) :
కొచిన్ ఫిలింస్ కార్పొరేషన్
ఎర్ణకులం.

ఆంధ్ర దత్తమండలములు :
పూర్ణ పిక్చర్సు
బెజవాడ.


హైదరాబాదు రాజ్యము :
దక్కను ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్
హైదరాబాద్.

మైసూరు రాజ్యము :
గ్లోబ్ పిక్చర్స్
బెంగుళూరు.

# బాల సీమలనేలు

"బా ల" మాగడ్డను బంగారు బిడ్డ
బంగారు సేవ్యాన ముంగారు వాన
ముంగారు కలమాల పొంగారు చెలము
పొంగారు పొలముల రంగారు ఫలము
రంగారు పంటకు సింగారు పుట్టి
సింగారి మాబాల సీమల నేలు.

— సీరిపి ఆంజనేయులు.




సంపాదకుడు—న్యాయపతి రాఘవరావు

సంపుటి 1.] మదరాసు, డిసెంబరు 1945 [సంచిక 5.

# పరీక్షలు

డిసెంబరు నెల వచ్చేసింది. ఇట్టే నెలలు గడిచిపోతున్నై. మీలో చాలా మంది యీ నెలలో అర్ధసంవత్సరం పరీక్షల హడావడిలో ఉంటారు.

పరీక్ష అన్నది ఒక రకమైన కొలతబద్ద. ఆకొలతబద్దకి 100 గీతలుంటాయి. వాటినే మనం మార్కులంటాము. మన చదువును ఆకొలతబద్దతో అప్పుడప్పుడు కొలుస్తారు. అందులో మనచదువు 35 గీతల వరకేనా వుంటే మనల్ని పై తరగతిలో వేస్తారు.

ఈ పరీక్షలకి చదివేటప్పుడు, తెలివైన పిల్లలు ఇంకా బాగా మార్కులు తెచ్చుకుందామని చదువుతారు. మధ్యరకం వాళ్ళు, కాస్తా ఆ 35 మార్కుల కోసమే చదువుతారు! మనం నూటికి నూరుమార్కులు తెచ్చుకుందాం అని ప్రయత్నిస్తే, ఆఖరికి కనీసం డెబ్భైయో, ఎనభైయో మార్కులు తెచ్చుకోగలం. కాని అసలు మన ప్రయత్నమే 35 మార్కులకయితే ఆఖరికి మనకి వచ్చేవి చాలా తక్కువ వస్తాయి. అందుచేత మన ప్రయత్నం ఎప్పుడూ తక్కువలో ఉండకూడదు. ఎంతో పైకి వుండాలి.

అసలు అట్టే దూరం ఆలోచిస్తే చదువుకీ, మార్కులకీ సంబంధం ఉండనే కూడదు. చదువుకీ మార్కులకీ సంబంధం పెట్టేరు గనుక, పిల్లల చదువంతా ఆ మార్కులకోసమే అవుతోంది. ఆ మార్కులు తెచ్చుకొనే ప్రయత్నంలో అసలు చదువు అంటే ఏమిటి? అది ఎందుకు? అన్న విషయం పిల్లలు మరిచిపోతున్నారు.

పిల్లలు, పరీక్షలంటే భయపడక, తాము చదివే విషయాలు చక్కా అర్థం చేసుకుంటూ చదివితే మంచి జ్ఞానం సంపాదిస్తారు. గుడ్డిచదువులు చదివితే, గుడ్డిమార్కులు వచ్చి, ఆఖరికి చీకటిలోనే ఉండిపోతారు.




# పాడండోయ్!

లేవండోయ్!
లేవండోయ్!
పాడండోయ్!

బాలులారా
పాపల్లారా
చిన్నారిచిట్టీ
చేతులుఎత్తి
పాడండోయ్!
ప్రభాతభేరి
పాడండోయ్
భారతజననీ
పావనజననీ
స్వేచ్ఛాగీతం
పాడండోయ్!
లేవండోయ్!

రచన: 'అంగర'




అనగా అనగా ఒకఅక్కా— తమ్ముడూ—

తమ్ము:—అక్కా ఏదే నాకథ చెప్పవే?

అక్క:—మరి చెప్తాను—వింటావా.

తమ్ము:—ఆఁ—ఏం కథ?

అక్క:—మరిచెప్తాను కాని నువ్వ ఊఁ – ఊఁ – ఊఁ అని ఊఁ కొట్టాలి.

తమ్ము:—అలాగే.

అక్క:—అనగా అనగా ఒకరైతు ఉండేవాడు—

తమ్ము:—ఊఁ—

అక్క:—వాడికి ఒక నువ్వుచేనుండేది—

తమ్ము:—ఊఁ—

అక్క:—ఒక సంవత్సరం వాడ్కి బాగా నువ్వులు పండేయి—

తమ్ము:—ఊఁ—

అక్క:—ఆనువ్వున్నిటినీ పెద్దకుప్ప వేసేడు.

తమ్ము:—ఊఁ—

అక్క:—మొన్న పెద్దగాలీ, వానా వచ్చిందే—జ్ఞాపకం ఉందా?—

తమ్ము:—ఊఁ—ఊఁ—

అక్క:—అలాగే, అప్పుడుకూడ పెద్ద గాలీ, వాన వచ్చింది!

తమ్ము:—ఊఁ—

అక్క:—అప్పుడు ఆరైతు నువ్వులన్నీ గాలికి ఎగిరిపోయాయి!

తమ్ము:—ఊఁ—

అక్క:—అప్పుడు ఎక్కడచూసినా నువ్వే!—

తమ్ము:——ఊఁ—

అక్క:—ఏరోడ్డుమీద చూసినా నువ్వే:—

తమ్ము:—ఊఁ—

అక్క:—ఏగోతులో చూసినా నువ్వే!—

తమ్ము:—ఊఁ—

అక్క:—ఏ కాలవలో చూసినా నువ్వే!—

తమ్ము:—ఊఁ – ఇంకా—

అక్క:—ఏపాకీ దొడ్లో చూసినా నువ్వే!—

తమ్ము:-ఛీ! ఛీ! నేనా?—

అక్క:-నువ్వు కాదు.

తమ్ము:-మరెవ్వరు?

అక్క:-ఆనువ్వులకుప్పలోనువ్వు. ఏ పెంట మీాద చూచినా నువ్వే!

తమ్ము:-ఆఁ! ఆఁ! నన్నే అంటు న్నావు! ఉండు తాతతో చెప్తా నుండు!

* * *

తాతవచ్చి అక్కని మందలిం చేడు.

[కథ కంచికి మనం ఇంటికి.]

---


## మీా బాల - మా బాల

మీా బాల
ఈ నాటి
నాడు నేడనక
మా బాలతో చేరి
మంచి మాటలతోటి
మురిసి పోవాలి
గంతులేయాలి
నవ్వుల్ల పువ్వులు
నామీాద విసరాలి

---


రచయిత: ము. శ్రీ. దొడ్డ యాచార్య (కాకినాడ)

# తిరుగలి



అత్తాచెవులో ఆవాలుపోసీ
కోడలుచెవులో గుడ్డలుతురిమీ
తిరుగు తిరుగమ్మా
తిరుగటి రాయి.

సంపాదన:— డి. కృష్ణమూర్తి, గన్నవరం.



# రాధాయి పెళ్లి

రచన: పన్యాలరంగనాథరావు

"నాకు పెళ్ళి చేస్తావుటే, అమ్మా!" అన్నాడు ఆరేళ్ళ రాధాయి పరిగెత్తుకుంటూవచ్చి. వాళ్ళమ్మ అప్పుడే, కాఫీ డికాక్షను పెట్టి పాలు కాస్తోంది.

రాధాయి, పొరిగింటిలో పెళ్లి హడావిడి చూశాడు. సగంలో బంతాట ఆపేసి అమ్మదగ్గర కొచ్చాడు.

"తప్పకుండా చేస్తానురా నాన్నా!" అన్నది వాళ్ళమ్మ పొంగుతున్న పాలలో నీటిచుక్క వేస్తూ.

"మరేం–నాకు వాళ్ళ సూరీడు నిచ్చి చేస్తే వొప్పుకోను. తెలిసిందా?" అన్నాడు రాధాయి అక్కడే బంతి ఎగరవేస్తూ.

"ఏంరా? నీ అందానికి

సూరీడు సరిపోలేదట్రా బాబూ?'' అంటూ నవ్వింది వాళ్ళ అమ్మ.

''సూరీడు వొద్దు—జింపిరి తలా చీమిడి ముక్కూ అదీనీ- అది అంటే నాకు అసహ్యం-'' అన్నాడు రాధాయి ముక్కు తుడుచుకుంటూ.

''సరే—పెళ్ళి చేస్తానుగాని - ఆ బంతి అవతల పడేసి కాఫీ తాగడానికి నాన్నగారిని పిలూ'' అంది వాళ్ళమ్మ.

''అలాక్కాదు – నాకిప్పుడే చెప్పాలి.'' అన్నాడు బంతిని ఎగర వేస్తూ రాధాయి.

''ఏమిటి చెప్పేది?''

''నాకెప్పుడు చేస్తావు?''

''ఏమిటి చెయ్యడం?''

''పెళ్ళి!-పెళ్ళి!—''

''నువ్వు చదువుకుని, పెద్ద పెద్ద పరీక్షలు ప్యాసయితే ఎంతో మంది వస్తారు నీకు పిల్లనిస్తామంటూ—అప్పుడు—నీకు నచ్చిన మంచి పిల్లను చూసి-''

రాధాయి సగంలో అడ్డొచ్చాడు.

''ఊఁ—నాకు రేపే చేసెయ్యాలి పెళ్ళి'' అన్నాడు రాధాయి.

రాధాయి వాళ్ళమ్మ కాఫీ తయారుచేసింది. చల్లారపోస్తోంది.

''నాన్నారిని పిలవరా?'' అన్నది.

''పిలుస్తానుగాని, మరినాకు రేపేపెళ్ళి చేసెయ్యాలి'' అని గునిశాడు రాధాయి బంతి గట్టిగా ఎగుర వేస్తూ. ఆబంతి ఎగిరికాఫీలో పడింది. కాఫీ వాళ్ళమ్మ ముఖం మీదికి తుళ్లింది. గిన్నె వొలికింది. కోపం పట్టలేక రాధాయి వీపుమీద వాళ్ళమ్మ ఒక్కటి చరిచింది.

''అయిందా పెళ్ళి?''—

---

## పాలు! పాలు!

మేష్టారు :—రామూ! అన్ని పాలలోకీ మంచి పాలు ఏవి?

రాము :—ఆవు పాలు.

మేష్టారు :—కృష్ణా! అన్ని పాలకంటే చెడ్డ పాలేవిటి?

కృష్ణ :—కోపాలు!

కశిమిశెట్టి పార్వతీబాయి (అనకాపల్లి)

# నిప్పు కథ

—మహీధర సూర్యమోహన్‌రావు, గుంటూరు.

మనకి ఉదయంలేచిన దగ్గర నుంచి రాత్రి పడుకోబోయే వరకూ నిప్పు అవసరం కలుగుతునే వుంటుంది. మన స్నానానికి వేడినీళ్ళకీ, వంటకీ, దీపాలకీ, చలికాలంలో చలికాచుకుందుకూ నిప్పు కావాలి.

అయితే "నిప్పు" అంటే ఏమిటి? అది మొట్టమొదట ఎవరు కనిపెట్టారు? ఇదంతా తెలుసుకుందాం.

## నిప్పు కనిపెట్టడం

మీరు "అగ్ని దేవుడు" అన్న మాట విన్నారా? పూర్వం కొన్ని కొన్ని దేశాల్లో నిప్పునుకూడా ఒక దేవుడుగా భావించి గుడులు కట్టి పూజించేవారు. ఆగుడిలో నిప్పు ఎప్పుడూ ఆర్పేయకుండా అలాగ వుంటుంది. మొన్న మొన్నటి వరకుకూడా మన దేశంలోకూడా కొందరి ఇళ్ళల్లో "నిత్యాగ్నిహోత్రం" — అంటే ఎప్పుడూ నిప్పు మండుతునే వుండటం—ఉండేది.

అయితే ఈ నిప్పు మొట్ట మొదట ఎవరు చేశారు? మనిషి చేయలేదు. ఏ అడవుల్లోనో, ఏ చెట్టుమీదో పిడుగుపడి అది అంటుకొనేది. మంటలు ఆకాశానికి లేచేవి. ఆ మంటల్నే ఆశ్చర్యంతో మనుష్యులు చూచేవారు. అదే అగ్నిదేవత అనుకొనేవారు.

మొదట్లో భయం వేసేది కాని ఒకధైర్యవంతుడు, మంటలు చల్లారిన తరువాత, మెల్లగా ఆ నిప్పుదగ్గరికి వెళ్ళేడు. చూచాడు. ఆ మండుతూన్న కొమ్మని పట్టుకుంటే!—అమ్మో!—ఏమి జరుగుతుందో!......కాని కొన్నాళ్ళకి ఎవడో మహాధైర్యవంతుడు ఆ మండుతున్న కొమ్మని పట్టుకొని ఇంటికి తెచ్చివుండాలి! అలాగ మొదట్లో నిప్పును సంపాదించి, నిప్పుని మచ్చికచేసుకొన్న ఆ మహానుభావు డెవడో!

పూర్వం గుహలు, మట్టి గుడిసెలు, చీకటిగా వుండేవి.

నిప్పు సంపాదించిన తరువాత, ఆనిప్పుమంటలు ఎప్పుడూ మండుతూ ఇళ్ళల్లో వెలుతురు, వెచ్చదనం వచ్చేది. కాని, నిప్పు ఒకవేళ పూర్తిగా ఆరిపోతే తిరిగి నిప్పుచేయడం ఎలాగ? ఆలోచించి, ఒకాయన ఎలాగో కనిపెట్టాడు. ఒకకర్రని ఇంకొక కర్రతో రాపాడించేడు. ఒక అరగంట అలా రాపాడించుతే నిప్పు రాజుకొనేది.

## అగ్గిపుల్లలు

మనం ఇప్పుడు అగ్గిపుల్లలు, అగ్గిపెట్టెకి గీసి చటుక్కున నిప్పు చేస్తున్నాం. పూర్వమో? పాపం వాళ్ళకి అగ్గిపుల్లలంటే ఏమిటో తెలియదు. బాగా ఎండిన కట్టె పుల్లలు తెచ్చి, వాటిని సన్నటి అంచుగల రాతితోగాని, ఎముకతోకాని కోసి, చదును చేసేవారు. తరవాత ఎంతో కష్టపడి పుల్లలు రాపిడి చేస్తే, వేడి పుట్టి నిప్పు అంటుకొనేది.

అగ్గిపుల్లలు కనిపెట్టి ఆట్టే కాలం కాలేదు. సుమారు 100 సంవత్సరాలకు పూర్వం కనిపెట్టారు. కాని అంతకు పూర్వం, నిప్పు తయారుచేసేందుకు మూడు ఆయుధాలు ఉపయోగించేవారు.

ఒకటి: ఇనపముక్క; రెండు: చెకుముకిరాయి; మూడు: వత్తి.

చెకుముకిరాయి, వత్తి ఒకచేతితోనూ, ఇనపముక్క ఇంకోక చేత్తోనూ పట్టుకుంటారు. ఇనపముక్కతో చెకుముకిరాయిమీద కొడతారు. చిన్న నిప్పు రవ్వలు వత్తి మీద పడుతాయి. దూది అంటుకొని నిప్పు అవుతుంది.

చూశారా, నిప్పు చేయడం ఎంత కష్టమైన పనో! మంచు దేశాల్లో ఎస్కిమోలని ఒకజాతి వారున్నారు. వాళ్లు నిప్పుచేసే పద్ధతి తెలుసా? ఒక పెద్ద కర్ర దిమ్మకి మధ్య కన్నం చేసి, అందులో ఇంకో (కర్ర) కొయ్య ఉంచి, తాడుతో, మనం చల్లకవ్వం తిప్పినట్లు తిప్పుతారు. ఆట్లా చాలాసేపు తంటాలు పడితే ఆకర్రలు వేడి ఎక్కి అంటుకుంటాయి.

ఈ కష్టాలు ఏవీ లేకుండా ఇప్పుడు మనకి హాయిగా అగ్గిపెట్టెలు వచ్చేయి.

అసలు యీ అగ్గిపుల్లలు ఎలాగ తయారవుతాయో అదంతా వేరే కథ.



# మూరెడు పళ్లు - జానెడు పళ్లు

ఒక వూళ్లో ఒక అత్తగారూ కోడలూ వున్నారు. అత్తగారి పళ్లు మూరెడుపొడుగు. కోడలి పళ్ళు జానెడు పొడుగు. కోడలి పళ్ళు అసహ్యంగా వుంటాయని కోడలిని వెళ్ళగొట్టింది అత్తగారు. కోడలు పోయిపోయి ఒక అరణ్యములోకి పోయింది. అక్కడ ఎండగాలికి వడగొట్టి ఒక చెట్టుకింద పడిపోయింది.

ఆ చెట్టుమీదికి రోజూ రెండు పక్షులు వస్తూవుండేవి. అట్లాగే ఆరోజుకూడా వచ్చేయి. వచ్చి చెట్టుకిందవున్న పిల్లను చూచి, ‘‘ఈ పిల్ల చాలా బాగా వుంది. ఈ పిల్లకు ఈ పళ్లు లేకుండా మంచి పళ్లువుంటే బాగా వుంటుంది’’ అనుకున్నాయి. అప్పుడు మగ పక్షి కిందికిదిగి, పిల్లదగ్గిరకువచ్చి, ఆ పళ్ళన్ని వూడగొట్టి పైనున్న ఆడపక్షిని చూసి ‘‘దానిమ్మగింజలాంటిపళ్లు పెట్టమంటావా? దబ్బగింజలాంటిపళ్లు పెట్టమంటావా?’’ అని అడిగింది. ఆడపక్షి దానిమ్మగింజలాంటిపళ్లు పెట్టమంది. అట్లా దానిమ్మగింజలాంటి పళ్లుపెట్టి ఆ పక్షులు ఎగిరిపోయాయి. కొంతసేపటికి ఆపిల్ల లేచి తనకు యిదివరకున్న పళ్లు పోవటము చక్కనిపళ్లు రావటము చూచి సంతోషపడి ‘‘ఇప్పుడు ఇంటికివెళితే మా అత్తగారు ఏమీ అన’’దని ఇంటికివచ్చింది. కోడల్ని చూచి అత్తగారు సంతోషపడి ‘‘ఇంత చక్కని పళ్లు నీకు ఎలా వచ్చాయి’’ అని అడిగింది. కోడలు ‘‘మీరు వెళ్ళగొట్టితే నేను ఒక అరణ్యములోకిపోయి ఒక చెట్టుకిందపడి పోయాను. తెలివివచ్చి చూచుకునేటప్పటికి ఇలా వున్నవి’’ అన్నది.

సంపాదన:

కాజ త్రిపురసుందరి

గుంటూరు.



అప్పుడు అత్తగారు "నేనుకూడా పోతాను. నాకుకూడా మంచి పళ్లు వస్తాయి" అని చెప్పి సంతోషముతో ఆ చెట్టుకింది కే పోయి కళ్లు మూసుకొని పడుకుంది. రోజూ మాదిరిగా పక్షులు రెండూ చెట్టుమీదకు వచ్చి చెట్టుకిందనున్న అత్తగారినిచూచి "ఇవాళకూడా యింకోమనిషి పడుకుంది. ఆమెకుకూడా పళ్లు అలాగే వున్నవి" అనుకొని మగపక్షి కిందకు దిగి మెల్లిగా ఆ పళ్ళన్నీ వూడగొట్టి ఆడపక్షిని చూచి "దానిమ్మగింజలాంటివి పెట్టనా? దబ్బగింజలాంటివి పెట్టనా?" అని అడిగింది. వెంటనే అత్తగారు, "నాకోడలుకుపెట్టి నట్టివేపెట్టు" అంది. ఆమాటలు విని "ఓరిబాబో— ఇది ఏదో దయ్యమురా" అని అనుకొని రెండుపక్షులూ ఎగిరి పోయాయి. అప్పుడు అత్తగారు బోసినోటితో ఏడుస్తూ ఇంటికి వచ్చింది. అత్తగారిని చూచి కోడలు పకపకానవ్వింది.



# నాన్నా లే!

నాన్నా లే!
తెల్లారింది !!
కన్నులు తెరువు
మొహం కడుక్కో,

సూర్యుడు వొచ్చాడు
చుక్కలు పోయాయి
పువ్వులు నవ్వాయి
పిట్టలు పాడాయి

అదిగో బాల
పిలుస్తూ వుంది,
ఆడుకునేందుకు
బయటికి రా!

రచన: సి. హెచ్. ఆచార్య.

పాపాయిలకు:

# "అ ఆ ఇ ఈ లు"

అమ్మమాట వినవలయు సుమా!
ఆలస్యముగ బడికేగకుమా!
ఇల్లు రాత్రులను కదలకుమా!
ఈత నేర్చుటది మేలు సుమా!
ఉదయమునందే మేల్కొనుమా!
ఊరక కాలము చెరుపకుమా!
ఎన్నడు అబద్ధ మాడకుమా!
ఏజీవిని హింసింపకుమా!
ఐకమత్యమే బలము సుమా!
ఒకరి నెపుడు నిందింపకుమా!
ఓర్మిలేమి కూడనిది సుమా!
ఔదార్యము బహు మేలు సుమా!

రచన: ది. అ. సత్యనారాయణ,
భీమునిపట్నం.

# వైద్యపు పాట

[శ్రీ వెంకట పార్వతీశ్వర కవులు రచియించిన "బాల గీతావళి" నుంచి]

కాళాగజ్జీ - కంకాళమ్మా
వేగూచుక్కా - వెలగామొగ్గా
మొగ్గాగాదు - మోటికి నీరు
నీరూగాదు - నిమ్మలవాయి
వాయీగాదు - వావింటికూర
కూరాగాదు - గుమ్మడిపండు
పండూగాదు - పాపాయికాలు
కాలూదీసి - గట్టునబెట్టు.

[ఈ పాట, పిల్లలు కాళ్లు చాపుకొని ఆడే పాటగానున్నను, ఇందులో కాళ్ల గజ్జికి మందున్నట్టు కనబడుచున్నది. అనుభవజ్ఞులగు తెలుగు వైద్యులెవరైనా దయయుంచి దీని అర్థమును వ్రాసిపంపినచో కృతజ్ఞతాపూర్వకముగ బాలలో ప్రకటింతుము—సం॥]




బాల సాయము బ్రహ్మసాయము. మా బాలానందము అందరికి బ్రహ్మానందము. మా బాల సాయము మహాకవి కాళిదాసునకు గూడ కావలసి వచ్చినది. ఎట్లందురా ? చదువండి!

పూర్వము భోజరాజ ఆస్థానములో పలువురు పండితు లుండెడివారు. వారిలో కవి కాళిదాసు గొప్పవాడు. కాళిదాసు కవిత్వము కమ్మనిది, గనుక భోజరాజు ఆయనయందు మిక్కిలి మక్కువఁ గలిగి యుండెను. కానీ, అసూయాపరులగు పండితుల కయ్యది కంటకారముఁ బోసినట్లుండెను. భోజరాజు వీరి చర్యల నెఱింగెను. వీరి గర్వమును సమూలముగ నశింపఁజేయఁదలచి, పండితుల సభ దీర్చి, యిట్లాజ్ఞాపించెను. "పండితులారా! మీలో నెవ్వరైనను, నే నిచ్చు సమస్యను పూర్తిచేసి తెచ్చిన వారికి, అక్షరమునకు లక్షవరహాలిచ్చి, ఆస్థానమందు సర్వగౌరవము లిచ్చుచుండెదను. లేనిచో తగు అవమానమును బొందెదరు" అని పలికెను. పండితులును సమ్మతించిరి. సమస్య "కఖగఘ" అని చెప్పెను.

సమస్యను పండితులు శాయశక్తుల పాండిత్యమును ప్రయోగించి చూచిరి. కానీ, పాపము! వారి పచ్చి పాండిత్యము పండినదిగాదు. అసూయాపరుల కంతే! ఈ సమస్యావార్త యెట్లో కాళిదాసు చెవిఁబడెను. కాళి

దాసు ఆలోచించుచూ, బజారు వీథికి బయలుదేరెను. "ఆడబోయిన తీర్థ మెదురయినట్లు" యింతలో మన బాల తాటియాకుల పుస్తక మొకటి చంకబెట్టి బడికి వెళ్లుచుండెను. కాళిదాసు బాలను సమీపించి యిట్లడిగెను.

కాళిదాసు:—కా త్వం బాలే!
(ఓ బాలా! ఎవతెవు నీవు?)

[మన బాలగూడ సంస్కృతము నేర్చుకొన్నది. గనుక బ్రహ్మానందముతో బదులుం బలికెను.]

బాల:—కాంచనమాలా (నేను కాంచనమాలను.)

కాళిదాసు:— కస్యాః పుత్రీ? (ఎవతె కూతురవు?)

బాల:—కనకలతాయాః (కనకలతా పుత్రికను)

కాళిదాసు:—హస్తే కింతే? (నీ చేతిలో యేమున్నది?)


భాల:-తాళీపత్రమ్. (తాటియాకుల పుస్తకము.)

కాళి:—కా వా రేఖా? (అందులో యేమి అక్షరము లున్నవి?)

బాల:—క ఖ గ ఘ. (కఖగఘ అను అక్షరము లున్నవి.) అని బదులు చెప్పెను. బాల ద్వారా కాళిదాసునకు చక్కగా సమస్య కుదిరెను. కాళిదాసునకు బాలసాయము బ్రహ్మసాయ మాయెను. బ్రహ్మానందముతో కవితిలకుడు, భోజరాజు నెదుట సమస్యను యిట్లు రమ్యముగ చదివెను.

శ్లో॥ కా త్వం బాలే! కాంచనమాలా,
కస్యాః పుత్రీ? కనకలతాయాః,
హస్తే కింతే? తాళీపత్రం
కావా రేఖా? క ఖ గ ఘ.

బళి! బళి! బాలసాయము బ్రహ్మసాయము గనుక, భోజరాజు కాళిదాసును గౌరవించి, అక్షరమునకు లక్షవరహాలొసంగెను. అసూయాపరులగు పండితులు పండ్లిగిలించిరి. మా బాల ఫక్కున నవ్వెను. కాళిదాసు అక్షర లక్షవరహాలు పొందెను. మా బాలకు గూడ అందులో అర్థభాగము రావలసియున్నది. అట్లే కాళిదాసు బాలను గౌరవించెను. బాల బ్రహ్మానందముతో బడికేగెను. బాల సాయము బ్రహ్మసాయము.



# పొత్తు

రచన : వద్దిపర్తి వెంకటేశ్వరశర్మ,
రాచకొండ నరసింహమూర్తి.
(కేసరీ హైస్కూలు. మద్రాసు)

ప్రొద్దు పొడిచినది
పువ్వు పూచినది
ప్రొద్దు లేచినది
పువ్వు నిలిచినది.

♦ ♦ ♦

ప్రొద్దు తిరిగినది
పువ్వు వ్రాలినది.
ప్రొద్దు క్రుంకినది
పువ్వు వాడినది.

♦ ♦ ♦

ప్రొద్దు, ఉండును పైన,
పువ్వు ఉండును క్రింద,
ప్రొద్దు పువ్వులకింత
పొత్తు లెందులకో?

♦ ♦ ♦

నీవు నీలో నున్న
నేను నాలో నున్న
ఎంత దూరానున్న
ఇద్దరము నొకటె!


♦ ♦ ♦

నీవు నీ యింటికి
నేను నా యింటికి
పోయి ఉండినకూడ
పొత్తులివి పోవు.

# "జమాదార్"

సంపాదన: సి. వి. మల్లికార్జునమూర్తి.

కాకీ కాకీ మాలా కాకి
కాకిని నేను గంగలో ముంచితే
గంగా నాకూ నీళ్లూ ఇచ్చె
నీళ్లు నేనూ గోవుకు ఇస్తే
గోవూ నాకూ పాలూ ఇచ్చె
పాలూ నేనూ అమ్మా కిస్తే
అమ్మా నాకూ రొట్టె ఇచ్చె
రొట్టె నేనూ పంతులకిస్తే
పంతులు నాకూ చదువూ ఇచ్చె
చదువు నేనూ మామా కిస్తే
మామా నాకూ పిల్లా నిచ్చె
పిల్లా పేరు మల్లి మొగ్గ
నా పేరు 'జమాదార్'



సంపాదన; శ్రీ చింతాదీక్షితులు.

అల్లవారింటికీ - చల్లకెడితేను
అల్లవారీ కుక్క - భౌంయిమన్నాది!
నా కళ్ళ గజ్జెల్లు - ఘల్లుమన్నాయి
నా చంకలో బిడ్డ - కారుమన్నాడు




# తాజ్ మహల్

"మామిడి కొమ్మను అల్లు
కున్నదీ మాధవిలత ఒకటీ.."

అని తెలుగులో ఒక చక్కటి పాట వుంది. ఆపాట తాజ్‌మహలునుగురించి వ్రాసిందే. ఐతే ఈ తాజ్‌మహల్ ఏమిటీ?—ఒక అందమైన భవనం. ప్రపంచములో ఎన్నో సొగసైన మేడలూ, మిద్దెలూ వున్నవి కద. కాని ఏదీ అందంలో తాజ్‌మహల్‌తో సరితూగదు. అంత చక్కటి కట్టడ మన్నమాట! ఆ చక్కదనమేమిటో మనం కూడా కాస్త చూడాలి.

హిమాలయాలలో 'యమున' అని ఒకనది పుట్టింది. ఆయమునా నది ఒడ్డున 'ఆగ్రా' నగర ముంది. ఆ నగరం నుంచి షాజహాన్ అనే చక్రవర్తి ఒకప్పుడు మన దేశాన్ని పరిపాలించేవాడు. ఆయన భార్య పేరు ముంతాజ్ మహల్. షాజహానుకు ఆమె అంటే చాలా యిష్టం.

ఒకప్పుడు ముంతాజ్‌మహలుకు జబ్బు చేసింది. ఎందరో హకీములు [వైద్యులు] ఎన్నో మందులు వేశారు కాని ఏమీ లాభం లేకపోయింది. పాపం షాజహాను రాత్రింబగళ్లు ఆమె

పక్కలోనే కూచుని ఎంతో శ్రద్ధ తీసుకున్నాడు. కాని ఆమె బ్రతకలేదు. చనిపోయే ముందఱ షాజహానుతో మళ్ళీ పెళ్ళి చేసుకోవద్దని, తన జ్ఞాపకం కోసం ఏదైనా కట్టించమనీ రెండు కోరికలు కోరింది.

ఆవిధంగానే షాజహాను మళ్లీ ఎవరిని పెళ్ళి చేసుకోలేదు. ఆమెను ప్రజలందరూ జ్ఞాపకముంచుకోవాలని ఆమె కోరినట్టే యమునానది వొడ్డున వజ్రాలూ, రత్నాలూ కూర్చి పాలరాతితో ఎంతో అందమైన సమాధిని చాలాసొమ్ము వ్యయపరచి కట్టించాడు. ఆభవనమే తాజ్ మహల్!

తెల్లటి పాలరాళ్ళతో కట్టించిన ఈ తాజ్‌మహల్ ఎప్పుడో 300 ఏళ్ళ నాటిదైనా నిన్ననో, మొన్ననో కట్టించినట్టు స్వచ్ఛంగా మిలమిలలాడుతూ వుంటుంది.

వెన్నెట్లో దీని అందం ఇంతా అంతా అని చెప్పడానికి వీలుపడదు. పైన మినుకు మినుకుమనే నక్షత్రాలతోటి నీలాకాశం —పక్కన గలగలా పరుగుపెట్టే యమునానది—చుట్టూ పచ్చని చిగురాకులతోడి పూలమొక్కలు —జలతారు ముసుగు వంటి వెండి గోపురం—లేత గులాబి వన్నె ప్రతిఫలించే గోడలు—శిల్పాలలో అమరిన రత్నమాణిక్యాల కాంతి... చల్లగా ప్రశాంతంగా వుండే వెన్నెలరాత్రి వేళ ఇంత అందాన్ని చూస్తూ తాజ్ మహల్ ముందఱ కూచుంటే మనల్ని మనమే మఱచిపోతాము.

ఎటువైపు నుంచి చూసినా తాజ్‌మహల్ అందంగా కొత్త పెళ్ళికూతురు ముస్తాబుతోటి వెలుగుతూ వుంటుంది. చల్లటి వాతావరణంలో తెల్లటి పాలరాళ్ళ మీాద ఒక్కొక్క అడుగే వేసుకుంటూ నడిచి వెడితే లోపల పారశీక దేశపుపద్ధతులతో పూల తీగెలనగిషీలు కనిపిస్తాయి. ఒక్కొక్క పువ్వులో యాభై రత్నాలుకూడా ఎంతో నేర్పుగా అమర్చారు. అటుపైన సన్నటి దీపపు వెలుగులో ముంతాజ్ మహల్ సమాధి కనిపిస్తుంది. చిఱుచీకటిలో నిశ్శబ్దమైన వాతావరణంలో లోపల ఆసమాధి ముందఱ ఆశ్చర్యంగా నిలబడి వుండగా హఠాత్తుగా ఒకమూలవీ

[మహమ్మదీయుల పూజా గి]

కొన్నిగీతాలు చదవడం వినిపిస్తుంది. అంతా కొత్తగా తమాషాగా ఏదో లోకం లోకి వెళ్ళినట్టుగా వుంటుంది.

పాపం షాజహానుకు ముంతాజ్ మహల్ మీద ఎంత మక్కువ ఉండడం చేత తాజ్ మహల్ వంటి గొప్పసమాధిని కట్టించగలిగాడో ఆలోచించండి.


అందుకే ద్విజేంద్రలాల్ రాయ్ అనేకవి ఈతాజ్ మహలును గురించి "షాజహాన్ దుఃఖంచేత కార్చిన కన్నీళ్ళన్నీ గడ్డకట్టి ఈతాజ్ మహల్ గా ఏర్పడింది" అని వ్రాశాడు.

నిజమేనేమో, తాజ్ మహల్ మనుష్యులు కట్టింది కాదేమో అనిపిస్తుంది దానివంక చూస్తుంటే. గాలిలో తేలిపోతున్నట్టు తెల్లగావున్న ఈచక్కదనాన్ని ఊసుపోని ఏదేవతలైనా కల్పించారేమో, ఎప్పుడైనా ఇది మాయమైపోతుందేమోఅన్నంత సుకుమారంగా వుంటుంది.

షాజహాన్ చనిపోయేటప్పుడు చివరిచూపు తాజ్ మహల్ వంక చూస్తూనే కన్నుమూశాడు. తరువాత అతని సమాధికూడ తాజ్ మహల్ లోనే ముంతాజ్ మహల్ సమాధి సరసనే కట్టారు. ఇప్పుడు ఆగ్రా వెళ్ళినవారికి ఆజంట సమాధులు కనిపిస్తాయి.

* * *

ప్రపంచంలో "ఏడు వింతలు" వున్నాయని ఇంగ్లీషు వాళ్ళు చెపుతూవుంటారు. ఆఏడు 'వింతల'లో వాళ్లు తాజ్ మహలును చేర్చలేదు కాని అది వాళ్ళ వింతలకంటె ఇంకెంతో వింతగా వుంటుంది. అందుచేత ఇప్పటి వాళ్లు దీనినికూడా "ఏడువింతల"లో కలుపుకున్నారు. తాజ్ మహల్ అందుకు తగినదే కదూ?



# ధ్రువుడు

[అన్నయ్య]

(మీరెప్పుడేనా ఆకాశంమీద ధ్రువనక్షత్రం చూశారా ? అయ్యో చూడలేదూ ? ఈసారి మీ అమ్మనేనా నాన్ననేనా చూపించమని అడగండి. అ ధ్రువనక్షత్రం కథే యీ చిన్ని నాటకం.)

✱

రంగము :–ఉత్తానపాద మహారాజాగారి అంతఃపురంలో

ధ్రువుడు, ధ్రువుడుతల్లి సునీతి

ధ్రువ:–అమ్మా ... ఇవాళ నాన్నగారు ఇక్కడికి ఒస్తారన్నావ్... ఇంకా రాలేదేమీ ?...ఇంకా ఎప్పుడొస్తారూ ?

సునీతి :–ఏమో నాయనా...ఏదో పనుండి రాలేకపోయారేమో...వెళ్ళి ఆడుకో.

ధ్రువ :–అమ్మా...ఇక్కడ నాకేం తోచటంలేదే...తమ్ముడు ఉత్తముడు దగ్గరకు వెళ్ళి ఆడుకుంటాను.

సునీతి :–ఒద్దు నాయనా! అక్కడికి తరుచు వెళ్ళకు! ఉత్తముడు ఇక్కడికి వస్తే ఆడుకుందువు గానిలే.

ధ్రువ :–ఏంవమ్మా ... నేనక్కడికి ఎందుకు వెళ్లొద్దు? నన్ను తమ్ముడు రమ్మన్నాడు.

సునీతి :–అదికాదు నాయనా!... అక్కడికి నువ్వు వెళితే, మీ పిన్నమ్మ సురుచీదేవికి ఇష్టంవుండకపోవచ్చు... ఒద్దు నాయినా...అక్కడికి వెళ్ళొద్దు.

ధ్రువ :–అబ్బ...ఒక్కసారి వెడతానమ్మా, తమ్ముడితో ఆడుకుని వస్తాను.

సునీతి :–సరే...చప్పునరా.

* * *

[రంగము: సురుచీదేవి అంతఃపురంలో]

సురుచీదేవి, కొడుకు ఉత్తముడు

ఉత్తమ : అమ్మా ... నాకు జోడు గుర్రాలబండి చేయిస్తానన్నావు, చేయించవూ ?

సురుచి :–అలాగే నాయనా ... నాన్నగారితో చెప్పి చేయిస్తాలే.

ఉత్తమ :–అమ్మా ... మంచి గుర్రబ్బండి, నాన్నగారిలాంటి గుర్రబండీ చేయించేవే.

సురుచి :–అలాగే నాయనా ... నాన్నగారు రానీ.

ఉత్తమ :–అమ్మా ... నాన్నగారు ఇంకా రాలేదేమీ ?

సురుచి :–అదుగో ... మాటలోనే వస్తున్నారు...(కొంచెం ఆగి) ఏం ఇంత ఆలశ్యంగా ఒచ్చేరూ ?

ఉత్తాన :-ఏమీలేదూ...మన మంత్రితో రాజకీయ విషయాలు మాట్లాడుతూ ఆలశ్యం అయింది...ఏమీ ?

ఉత్తమ :-నాన్నగారూ! నాన్నగారూ!! నాకు మాంచి గుర్రబ్బండీ చేయించరూ ?

ఉత్తాన :-అలాగే నాయనా...రా ...ఇలారా... నా తొడమీద కూచో ...నా బంగారు తండ్రి...ఏదీముద్దు (ముద్దు పెట్టుకొనును).

ఉత్తము :-నాన్నగారూ, నా గుర్రబ్బండీకేం, రెండు తెల్లటి గుర్రాలు కొనండేం ?

రాజు :-అలాగే నాయనా...కొంటానుగానీ—ఆ గుర్రబ్బండీతో ఏం చేస్తావు ?

ఉత్తము :-నే నేం... నేను ఆ బండీ ఎక్కి చక్కా షికారు వెడతాను. ధ్రువుడు అన్నయ్యాని కూడా ఎక్కిస్తాను.

సురుచి :-ఆఁ!...ధ్రువుడెందుకూ ? ...వాడి బతుక్కి గుర్రబ్బండీ ఒకటి!

ఉత్తమ :-అదేఁవిటే అమ్మా అలాగంటావు ?...నాన్నగారూ! ధ్రువన్నయ్యకూడా ఒక బండీ కొనరూ ?

ఉత్తాన :-అలాగే నాయనా.

ఉత్తము :-అదుగో ధ్రువన్నయ్య కూడా ఇక్కడికే వస్తున్నాడు... అన్నయ్యా! అన్నయ్యా!...ఇలారా!

ధ్రువ :-నాన్నగారు ... ఇక్కడా వున్నారు.

ఉత్తమ :-ఇలారా అన్నయ్యా... నాన్నగారి తొడమీద కూచో... నేను ఈ తొడమీద, నువ్వు ఆతొడమీద.

సురుచి :-ఏయ్! ధ్రువా! ఎక్కడికి అలాగ!

ధ్రువ :-నాన్నగారి దగ్గరికి.

సురుచి :...వీలులేదు!... నువ్వలా దూరంగా నిలబడు!

ధ్రువ :-ఏమీ ?

సురుచి :-ఏమా!...చూస్తున్నావా, మీ నాన్నగారి ఒళ్ళో ఎవరు కూచున్నారో!

ధ్రువ :-అవును. తమ్ముడు.

సురుచి :-ఆతమ్ముడే మీ నాన్నగారి తొడమీద కూర్చోవాలి, తెలుసా! నువ్వు కూర్చోకూడదు! దూరంగా వుండు!

ధ్రువ :-ఏమీ? తమ్ముడు కూర్చుంటే నేను కూర్చోకూడదూ ?

సురుచి :-హుఁ!... కూర్చుంటావు! ...నక్క ఎక్కడ? దేవలోకం ఎక్కడ ?

ధ్రువ :-అదేఁవిటమ్మా అలా అంటున్నావ్ ...నీమాటలు నాకర్థంకావటం లేదు.

సురుచి :-ఇదుగో ధ్రువా! నువ్వు మీ నాన్నగారి తొడమీద కూర్చోడానికి అర్హతలేదు తెలుసా!

ధ్రువ :-ఎందుచేతమ్మా! తమ్ముడు కూర్చున్నప్పుడు, నేనెందుకు కూర్చోకూడదు ?

సురుచి :-ఓహో! ...అధిక ప్రసంగం చేస్తున్నావే!

ధ్రువ :-అమ్మా... నే నేం చేశాను! నాన్నగారి ఒళ్ళో తమ్ముడు కూర్చునప్పుడు నేనెందుకు కూర్చోకూడదు! నే నేం తప్పుచేశానమ్మా ?

సురుచి :-తప్పా!...నా కడుపున నీవు పుట్టకపోవడమే తప్పు! నా కొడుకువి కాకపోవడమే తప్పు!

ధ్రువ :-అమ్మా...అయితే, నాన్నగారు నాకూ నాన్నగారే, తమ్ముడికీ నాన్నగారే కదా, నేనెందుకు కూర్చోకూడదు?

సురుచి :-ఓహో! పిట్ట చిన్న... కూత ఘనంగావుందే!...నీకు అర్హత లేదు. అంతే!...ఫో!

ధ్రువ :-అయితే అమ్మా... నాకు అర్హత, ఎలా కలుగుతుందో చెప్పవ్?

సురుచి :-ఎలాగా? ఒచ్చే జన్మలో కల్గుతుంది. మళ్ళీ జన్మలో నీకు అదృష్టంవుండి నా కడుపునపుట్టితే అప్పుడు నీ తండ్రిఒళ్ళో నువ్వుకూడా కూర్చోడానికి అర్హత కలుగుతుంది...ఫో!... పోయి, ఆదేవుణ్ణి అలా ప్రార్థించుకో ...ఫో!

[ధ్రువుడు ఆ అవమానం భరించలేక... ఏడుస్తూ ఇంటికి వచ్చాడు.]

సునీతి :-నాయనా, ధ్రువా!... ఎందుకలా ఏడుస్తున్నావూ?

ధ్రువ :-అమ్మా, అమ్మా నేనట నాన్నగారి తొడమీద కూర్చోకూడదట! (ఏడ్పు)

సునీతి :-ఎవరన్నారురా!... సురుచీదేవా?

ధ్రువ :-(ఏడ్పు కంఠంతోనే)... అవునమ్మా!

సునీతి :-ఏమీ? ఎందుకు కూర్చోకూడదు?

ధ్రువ :-నేనట...తనకడుపున పుట్టలేదట...అందుకని నాకు అర్హత లేదట!

సునీతి :-పోనీ నాయనా...వూరుకో ...ఊరుకో...ఏడవకు.

ధ్రువ :-లేదమ్మా... నేను ఇక్కడ వుండను. నేను వెళ్ళిపోతాను.

సునీతి :-ఎక్కడికి?

ధ్రువ :-అడవుల్లోకి.

సునీతి :-అయ్యో ఎందుకూ?

ధ్రువ :-దేముణ్ణి ప్రార్థించడానికి. నాన్నగారి ఒళ్ళో కూర్చోడానికి వరం కోసం.

సునీతి :-వెర్రితండ్రీ ... దీనికోసం అడవుల్లోకి వెళతావా? ఒద్దు నాయినా ఒద్దు.

ధ్రువ :-అమ్మా నేను నిశ్చయించుకున్నాను. నేను వెళ్ళి దేవుణ్ణి ప్రార్థిస్తాను.

సునీతి :-నాయనా, కుర్రవాడివి... ఒద్దు నామాటవిను...నిన్నువిడిచి నేను ఒంటరిగా వుండగలనా? తండ్రీ.

ధ్రువ:-అమ్మా...నువ్వెన్ని చెప్పు, నేనీ అవమానం భరించలేను...నన్ను అవమానిస్తే, నిన్ను అవమానించినట్లు కాదా అమ్మా?... నేనింతమాత్రం ఇక్కడుండను. నేను అడవుల్లోకి పోయి, దేవుణ్ణి ప్రార్థించి, నా పౌరుషం నిలబెట్టుకుంటాను.

సునీతి :-మంచిది నాయనా...మనందరికీ ఆ భగవంతుడే దిక్కు...

ధ్రువ :-అమ్మా...శెలవు.

సునీతి :-మంచిది ... నీకు జయము కలుగుగాక!

* * *

రంగము: అడవిలో

[ధ్రువుడు, తల్లిదగ్గర శలవు తీసుకుని అలాగ అడవిలోనుంచి వెళ్ళిపోతున్నాడు...ఎండనక, వాననక, రాత్రనక, పగలనక, రాళ్లనక, రప్పలనక... అలా అడవుల్లోంచి నడుచుకుంటూ వెళ్లిపోతున్నాడు, ధైర్యంగా, ఎక్కడికో. ఇంతట్లో నారదుడు ప్రత్యక్షం!]

[నారదుడు పాడుకుంటూవస్తాడు.]

నారద :-అబ్బాయీ! నువ్వెవరు? ...ఈ అడవిలో ఒంటరిగా ఎక్కడికి వెళ్తున్నావు?

ధ్రువ :-అయ్యా... నన్ను ధ్రువుడంటారు... ఉత్తానపాద మహారాజుగారి పెద్దకుమారుడిన్ని...అయ్యా తమరెవరు?

నారద :-నేను నారదుడిన్ని... ధ్రువా! మహారాజు కొడుకువై యుండి, ఈ కాలునడకని ఒంటరిగా ఎక్కడికి వెడుతున్నావు?

ధ్రువ :-నారదమునీంద్రా! ... నా తండ్రిగారూ, నా సవతితల్లీ నాకు చేసిన అవమానం భరించలేక, నేను తపస్సు చేయడానికి వెళ్తున్నాను.

నారద :-తపస్సా!...ఇంత చిన్న వయస్సులోనా!...ధ్రువా! వద్దు వద్దు నీవు తపస్సు చేయలేవు...గొప్పగొప్ప మునీశ్వరులే తపస్సు సరిగ్గా చేయలేక పోతున్నారు, నీవనగా ఎంత? నా మాటవిని ఇంటికి వెళ్ళి హాయిగా సుఖంగా వుండు.

ధ్రువ :—నారదమునీంద్రా!... నా ఇంట్లో నాకు స్థానంలేదు. నేను క్షత్రియ కులంలో పుట్టేను. నాకు పౌరుషం, కార్యదీక్షవుంది. నాకు దేవుడు ప్రత్యక్షమై నా అగ్రస్థానం నాకు ఇచ్చినంతవరకూ నేను పట్టు వదలను.

నారద :-భేష్! ధ్రువా!...నీధైర్యానికీ, నీపట్టుదలకీ మెచ్చేను. నీకుజయము కలుగు గాక...ఇదుగో ఇలారా...నీకు మంత్రోపదేశం చేస్తాను ... (చెవిలో మంత్రోపదేశము చేయును.)

ధ్రువ :-నారదమునీంద్రా ... నమస్కారము.

నారద :-నీకు శుభమగుగాక...

(నారదుడు పాడుకుంటూ వెళ్ళిపోవును)

[ధ్రువుని తపస్సు]

ధ్రువుడు :-(మంత్రం) ఓం నమో నారాయణాయనమః ఓం నమోనారాయణాయనమః.

(ప్రళయం, భూకంపం)

* * *

[రంగము : ఇంద్రలోకంలో]

ఇంద్రుడు :-దేవతలారా! ...భూలోకం ఎందుకు అలాగ గజగజ లాడిపోతోంది?

దేవత :-దేవేంద్రా! ... ...భూలోకంలో ధ్రువుడని ఒక అయిదేళ్ళ కుర్రవాడు...ఘోరమైన తపస్సు చేస్తున్నాడట! ఎన్ని ఆపదలువచ్చినా ఎన్ని కష్టాలువచ్చినా వేటినీ లెక్కచేయక, ఓర్చి, ఒకే దీక్షతో తపస్సుచేస్తున్నాడట! ఆ తపోమహిమకి భూమి గజగజ లాడిపోతోంది,

(ప్రళయం, భూకంపం)

ఇంద్రుడు :-అయ్యో అయ్యో అదేం విటి! మన దేవలోకంకూడా అదిరి పోతోంది!

దేవత :-దేవేంద్రా! మనమందరం వెంటనే విష్ణుమూర్తి దగ్గరికివెళ్ళి రక్షించమని ప్రార్థిద్దాం...పదండి.

* * *

[రంగము : వైకుంఠంలో]

ఇంద్రుడు :-దేవా! భూలోకంలో గొప్ప ప్రళయంగా వుంది. ఆ ప్రళయము మా దేవలోకానికికూడా వ్యాపించింది. రక్షించండి! రక్షించండి!!

విష్ణు :-దేవతలారా! భయపడకండి! అది ప్రళయంకాదు. తపోమహిమ!... నేను ధ్రువునికి ప్రత్యక్షమై ఆ తపస్సు మానిపిస్తాను. మీరు వెళ్ళండి.

[రంగము : భూలోకంలో-అడవిలో]

(ప్రళయం, భూకంపం)

[ధ్రువుడు తపస్సు చేస్తూవుంటాడు ...విష్ణుమూర్తి ప్రత్యక్షం అవుతాడు]

విష్ణు :-ధ్రువా! ధ్రువా!

ధ్రువ :-(జపం చేస్తూనేవుంటాడు)

విష్ణు:-ఆహా...ఎంతదీక్షతో తపస్సు చేస్తున్నాడు!...తపస్సంటే ఇలా వుండాలి...దీక్ష అంటె ఇలావుండాలి. ...ధ్రువా!...ధ్రువా!!...లెమ్ము... లెమ్ము.

ధ్రువ :-ఎవరు ?

విష్ణు :-నేను ... విష్ణుమూర్తిని ... లెమ్ము...నీకోరిక నెరవేరును లెమ్ము.

ధ్రువ :-దేవా! ... తమరా! ... ఆహా! నాఅదృష్టము!...దేవా! వందనము.

విష్ణు :-ధ్రువా! నీతపస్సుకి మెచ్చేను...నీ సంగతంతా దివ్యదృష్టితో తెలుసుకున్నాను. నీవు ఈ భూలోకంలో చక్రవర్తివై ఎంతోకాలం రాజ్యంచేసి గొప్ప కీర్తిని పొందుతావు. అంతేకాకుండా, నీకీర్తి ఎల్లకాలం స్థిరంగా వుండేటట్లు, నేను నీకు ఆకాశంమీదకూడా అగ్రస్థానం ఇచ్చేను... ఆకాశంమీద, ఉత్తర దిక్కున ఒక నక్షత్రమై నీవు అన్ని నక్షత్రాల కంటె ఎక్కువ కాంతితో జిగజిగ మెరుస్తూ వుంటావు...ఇంక నీవు తపస్సు చాలించి నీ దేశమునకు పొమ్ము.

ధ్రువ :-దేవా! వందనము. సెలవు.

(విష్ణువు మాయమవుతాడు)

* * *

(రంగము : ఉత్తానపాద మహారాజుగారి కొలువులో)

ధ్రువ :-నాన్నగారూ! వందనము.


ఉత్తాన :-నాయినా! ధ్రువా!వచ్చితివా...రమ్ము ఈ సింహాసనముపై కూర్చొనుము. ఈ రోజునుంచీ నీవే యీ రాజ్యమునకు చక్రవర్తివి.

ప్రజలు :-జై! ధ్రువ మహారాజుకీ జై!

(మంగళం)

[ధ్రువుడు ఎంతోకాలం రాజ్యం పరిపాలించి, గొప్పకీర్తిని పొందేడు. తరువాత, ఆకాశంమీద ఉత్తరదిక్కున ''ధ్రువుడు'' అన్నపేరుతోనే, ఒక పెద్ద నక్షత్రం అయి, ఇప్పటికి ప్రకాశిస్తున్నాడు.]

మదరాసు ఆలిండియా రేడియోలో అనుమతితో




రైలుబండికి బ్రేకులు, మోటారు కారుకి బ్రేకులు, సైకిలుకి బ్రేకులు.— బ్రేకుల ఉపయోగం మీకందరికి తెలుసు. బ్రేకులు లేకపోతే వచ్చే ప్రమాదం కూడా మీకు తెలుసు. ఏ బండికైనా— ఎంత వేగంగాపోయేశక్తి దానికుంటే, అంతబాగా పనిచేసే బ్రేకులు—ఒక్క క్షణంలో బండిని ఆపే శేటట్టు—, లేకపోతే, ఆ బండి ఎంతోహానికి కారణ మాతుంది. తనకు హాని— ఎదటివాళ్లకు హాని.

ఈ బ్రేకు లుపయోగించచడానికి ముందు బుద్ధి బయలుదేరుతుంది. అపాయం ఉన్నదని బుద్ధికి తోచినప్పుడు, ఆ బుద్ధి డ్రైవరు చేతులను ఆజ్ఞాపిస్తే, చేతులు బ్రేకు వేస్తాయి, బండి నిలబడిపోతుంది— ప్రమాదంతప్పిపోతుంది. మాటవరసకి మీరు పాఠాలు అతి శ్రద్ధగా చదువుకుంటున్నా రనుకోండి. ఆ సమయానికే మీ బుచ్చి తమ్ముడో, చిన్న చెల్లాయో వచ్చి "అన్నయ్యా నాకు నీ పుస్తకంలో బొమ్మలు చూపించవూ?" అని అడిగితే మీకు కోపంవస్తుంది - నిజమే— పట్టరాని కోపం వస్తుంది. అయితే ఆ కోపం మళ్ళించుకోకుండా, ప్రక్కనున్న రూళ్ళకర్ర తమ్ముడు మీదికో, చెల్లాయి మీదికో విసిరేస్తే— ఎంత ప్రమాదం! అందుచేత మీరు బుద్ధిమంతులైతే ఏం జేస్తారు ?—ఆ కోపానికి చప్పున బ్రేక్ వేస్తారు.

ఆలాగే మీకు కావలసిన చక్కని వస్తువులు కొన్ని దొంగిలించాలని ఒకప్పుడు బుద్ధి పుడుతుంది. అప్పుడు ఆ దొంగిలించే ఉద్దేశానికి వెంటనే బ్రేకు వేసు

కోవాలి మీరు. అదేవిధంగా- అసూయ, ఓర్వలేనితనం, కారణాన్ని యితరులకు హానిచేసే ఉద్దేశానికి ఎప్పటికప్పుడు బ్రేకు వేసుకోవాలి. మనకి బలమున్నదని చెప్పి, మనకంటె తక్కువ బలం ఉన్నవాళ్లనీ, చిన్న జంతువులనూ పీడించేపద్ధతికి బ్రేకు వేసుకోవాలి. ఒకప్పుడు, మీరు షికారు వెళ్ళినప్పుడూ- సినిమాకి వెళ్లినప్పుడూ- కొన్ని తినుబడి వస్తువులు ఎదురయ్యేసరికి, అబద్ధపు ఆకలివేసి - ఆ వేరుసనగలూ, ఆ బటాణీలూ, ఆ పులిసిపోయిన ఆవడలూ, కొనుక్కొని తినాలని ఎంతో తహతహ పుడుతుంది. ఆలాంటి తొందరను ఆపుకొనేటందుకు బ్రేకు వేసుకోకపోతే - ఆరోగ్యం చెడడము, కడుపు నొప్పి రావడం, మీ అమ్మో అమ్మమ్మో మీకు నోరు పెగల్దీసి గిద్దెడు ఆముదం గొంతుకలో పొయ్యడం - ఇన్ని అనర్థాలు వస్తాయి.

ఎప్పటికప్పుడు బ్రేకులు వేసుకోలేక పోతే మన ప్రవర్తన దుష్ప్రవర్తనంటారు - మనలను దుర్జనులంటారు. సమయానుకూలంగా బ్రేక్స్ వేసుకుంటూంటే మన ప్రవర్తన బాగుంటుంది- మనలను అంతా సజ్జనులంటారు. బ్రేకులు లేకపోతే మనిషి కూడా ఒక పెద్దపులో లేక ఒక రాక్షసితోనో సమానం అన్నమాటే కదూ! నాగరకత అంటే చెడ్డకి బ్రేక్స్ వేసుకొనేశక్తి అన్నమాట. తన ప్రవర్తనవల్ల ఇతరులకు హాని లేకుండా వుండి మేలు కలుగుతూ వుంటే ఆ జాతి నాగరకత గలది అన్నాం.

మీరంతా నాగరకులు అనిపించుకుందికి, ఎప్పటికప్పుడు బ్రేకు ఉపయోగించడం నేర్చుకోవాలి. ఇంటివద్ద, స్కూల్లో, ఆటల్లో, సంభాషణలో, సభల్లో, జీవితంలో అడుగడుక్కీ - మీ బ్రేకులను మంచి బాగా వుంచుకొని - అవసరం పడినప్పుడు ఒకక్షణంలోపున వాటిని ఉపయోగించడానికి మీరు సిద్ధంగా వుండాలి.



# ష్ట ష్టి ష్టు ష్టె!

రచన: వేదుల సుబ్రహ్మణ్యం

హిందూ హైస్కూల్, ట్రిప్లికేను.

అష్టావధానంలో గర్విష్టుడైన నిష్టల శిష్ఠావధాన్లు గారి కనిష్ఠ పుత్రుడగు కిష్టప్ప, ఇష్టం లేకపోయినా హిస్టరీ కష్టపడి చదివి, ఫస్టుమార్కు తెచ్చుకొని "బెస్టు" అనిపించుకున్నాడు.

తరవాత, కష్టము లేకుండా హిస్టరీ మాస్టరుగా అష్టమినాడు ప్రవేశించి మహారాష్ట్ర చరిత్ర చెప్పడంలో ప్రతిష్ఠ పొందాడు. కాని, నష్టతిథిలో ప్రవేశించినందుకు దృష్టాంతంగా కిష్టప్ప నిష్టా నియమం లేనివాడై, ఒక రిజిస్ట్రీ ఉత్తరం గురించి బలిష్ఠుడైన పోస్టుమేష్టరుతో తగవులాడి, వానితో ముష్టి యుద్ధం కూడా చేశాడు. అప్రతిష్ఠపాలైన కిష్టప్ప ఉద్యోగం వూడి అష్టకష్టాలూ పడి ఆఖరికి ముష్టి ఎత్తుకోవలసి వచ్చిందని రాష్ట్రమంతా విచారిస్తున్నారు.

[ఈ పై కథను గుక్క తిప్పకుండా గబగబ చదవగలరా? —సం॥]

# గుప్ చిప్ మిఠాయి!




పొట్టిబావ

మీకు నాకు ఒట్టు
ఎందుకో తెలుసా జట్టు?
అందులో వుంది గుట్టు!
అల్లరి చేస్తే రట్టు.
గిల్లము చేస్తే మొట్టు
మెల్లగ వుంటే గిట్టు
పిల్లలకైతే పెట్టు
పొట్టిబావ చెప్పాడు!

# చిట్టెలుక ప్రయాణం


[రచన : బొంబాయి ఆంధ్రబాలిక]



ప్రొద్దున్న లేచింది
చిట్టెలుక
పొలంలోకి వెళ్లింది
చిట్టెలుక


గాలికి వణికింది
చిట్టెలుక
చలికాచుకొన్నాది
చిట్టెలుక






ఊళ్లోకి వెళ్లింది
చిట్టెలుక
ఉట్టికి ఎగిరింది
చిట్టెలుక

తొంగితొంగిచూచింది
చిట్టెలుక
దోబూచు లాడింది
చిట్టెలుక




[illegible]ాలను పొంచుంది
చిట్టెలుక
ముసలమ్మ కథవింది
చిట్టెలుక





పీటక్రింద దూరింది
చిట్టెలుక
పిల్లల్ని బెదరించె
చిట్టెలుక

కొట్టుగది దూరింది
చిట్టెలుక
పట్టుబడే బోనుల్లో
చిట్టెలుక!






# రాము




రాము, తన చెల్లాయి గోడ మీద గీతలు గీస్తుంటే ఒద్దని చెప్తాడు.



రాము, తన పుస్తకాలు చినిగి పోకుండా శుభ్రంగా ఉంచుకుంటాడు.



రాము, తన చెయ్యి మురికిగా వుంటే, బాగా నీళ్లతో కడుక్కుంటాడు.




రాము, తనకి జలుబు చేస్తే, చేతిగుడ్డతో ముక్కు తుడుచుకుంటాడు.


# సోమూ



సోము, ఇంట్లో గోడల నిండా గీతలుగీసి, అసహ్యంగా చేస్తాడు.



సోము, తన పుస్తకంలోని పేజీలు నలిపేసి, కుక్క చెవు లాగ చేసేస్తాడు.



సోము, తన చెయ్యి మురికిగా వుంటే, తన బట్టలకే రాసేస్తాడు.



సోము, జలుబుగా వుంటే తన చేతికే రాసేసుకుంటాడు.



# కాకి



అనగా అనగా ఒక కాకి ఒక ఎముక ముక్కను ముక్కుకు కరచుకొని చెట్టు మీద కూర్చుంది. ఇది ఒక కుక్క చూచి ఎట్లాగయినా కాజేయాలని ఒక వుపాయం పన్నింది. అపుడు కుక్క అడిగిందిగదా : "కాకిబావా! కాకిబావా! నీవు బాగా సంగీతం పాడతావుట! - ఏదీ ఒక్క పాట పాడవూ" అని అడిగింది.

ఈ మాటలకు కాకి ఉబ్బిపోయి "కా! కా!" అని అరచింది. దాని నోట్లోఉన్న ఎముక క్రిందపడిపోయింది. ఇదే సమయమని ఆ ఎముకని కుక్క నోటితో కరచుకొని పరుగెత్తింది.

కాకి, కుక్క వెంబడె ఎగురుకుంటూ పోయింది. పోయి అడిగింది గదా : "కుక్కబావా! కుక్కబావా!

కథ, బొమ్మలూ పంపినవారు :


# కుక్క

నా ఎముక నా కిచ్చెయ్యవూ.'' అని. అపుడు కుక్క ''పో! ఎముకా లేదు, గిముకా లేదు.'' అని అంది. అంటే కాకి ''ఇవ్వవన్నమాటే!'' అని అంది.

కుక్క :—''ఇవ్వను పో. ఏం చేసుకుంటావో చేసుకో.''

అపుడు కాకి రెండో కాకిని పిల్చి దానితో రహస్యం చెప్పింది.

ఆ రెండో కాకి వచ్చి కుక్కతోక కొరికింది. అపుడు కుక్క ఈ రెండో కాకి పొగరు అణచుదామని భౌ! భౌ! మంటూ ఎముక వదలి వెనక్కి తిరిగి ఉరికింది. కుక్క అటు తిరగగానే ఇదే సమయమని మొదటి కాకి ఆ ఎముకను ముక్కుకు కరచుకొని ఎగిరి పోయింది.



జి. గోపాలకృష్ణమూర్తి, గుంటూరు.



# నాన్నమ్మ పాటలు



దేశరాజ్ - పి - రావ్

పాండవులు పిల్లలు

బంతులాట ఆడితేను

ఎంతమందితో పిల్లరారు?

ఎంతపొద్దులు గడుపుతారు?

తాతగారు వచ్చినారు నాన్నమ్మా

నీతో బంతులాడుతారు నాన్నమ్మా!

# బాలరాజు

బి. యస్. జయలక్ష్మి, మదరాసు.

ఒక వూరిలో ఒక రాజు వుండెను. అతనికి లేక లేక ఒక కొడుకు పుట్టెను. అతని పేరు బాల. బాల గారాబముగా పెరిగి కొంటె పిల్లవాడాయెను. ఒకదినమున బాల పిల్లలను చెట్టుమీద ఎక్కించి కొమ్మను ఆడించెను. వాళ్లు కిందపడిరి. చేతులు కాళ్ళు విరిగిపోయెను. వాళ్ళు రాజుదగ్గరకు పోయి 'అయ్యా మీ కుమారుడు కొంటె గాడు' అని చెప్పుకొనిరి. అప్పుడు రాజు 'బాలా! నీవు కొంటెగాడి వటనే?' అని అడిగెను. 'వాళ్ళు వట్టిమాటలు చెప్పుతున్నారు, నాన్నా!' అని బాల చెప్పెను. రాజు బాల మాటలు నమ్మక బాలను 'ఛీ, నా రాజ్యములో నుండిపో' అని వెళ్ళగొట్టెను.

బాల అప్పుడు ఏడ్చుకుంటూ ఏడ్చుకుంటూ అడవిలో పోవు చుండెను. అతడికి ఆకలి వేసెను. అప్పుడు అతడు మన్ను, నీళ్ళు కలిపి తినుచుండెను. ఆ దారినే ఒక అవ్వ పోవుచుండెను. ఆ అవ్వ అదిచూచి 'నాయనా! మన్ను నీళ్ళు తినుచున్నా వేమి' అని అడిగెను. 'అవ్వా! నేనేమి చేయుదును. మా నాన్న నన్ను వెళ్ళగొట్టెను.' అని బాల అనెను. అవ్వ 'నాయనా! నీవు వచ్చే పొయ్యేవాళ్ళ సొమ్ము దోచుకో' అనెను.

'నీ సొమ్ము దోచుకొనెదను' అని బాల అవ్వమూట లాగుకొనెను. అవ్వ 'నీకు చెప్పినదే తప్పు' అని తిట్టుకుంటూ వెళ్ళిపోయెను.

బాల వచ్చే పొయ్యే వాళ్ళం దర్నీ సొమ్ము తెమ్మని కొట్టే వాడు. ఒకదినమున ఒక రాక్షసుడు ఆ మార్గమున పోవుచుండెను. బాల ఆ రాక్షసుని చంప బోయెను. ఆ రాక్షసుడు మాయమై ఇంకొకచోట కనపడెను. ఇట్లు మూడుమార్లు కనపడెను. బాల ఆ రాక్షసుని వెంట గుంటూరు పోయెను. అక్కడ ఆ రాక్షసుని చంపెను.

రాజు మెచ్చి బాలను తన యింటిలో వుంచుకొనెను. కూతురును యిచ్చి పెళ్ళిచేసెను. బాల బాలరాజాయెను.

# నే చెప్పను

''జెట్టి''

నీకు అన్ని కథలు తెలుసుగా; ఒకటన్నా చెప్పకూడదూ.

'నే చెప్పను.'

'నీకు తెలుసని నేను అడిగాను. నాకుమాత్రం తెలీదనుకున్నావా'

'అయితే నీవే చెప్పు'

'నీలాగనుకున్నావా? విను చెబుతాను.'

'ఊఁ'

'ఒక ఊరిలో ఒక కుర్రాడుండేవాడు. వాడికి తల్లి లేదు, తండ్రి లేడు'

'ఆ...ఆ...ఆపు!.. ..నాకు తెలుసీకథ'

'ఆ! తెలియాలసిందే'

'చేప్తే...?'

'చెప్పు చూద్దాం'

'వాడు ప్రతి ఇంటికీ వెళ్ళి అడుక్కొని తింటుండేవాడు!

'ఊఁ

'ఓరోజు ఇలాగ వెడుతుంటె ఎక్కడా అన్నం దొరికింది కాదు. బాగా ఎండపడ్డది.'

'ఊఁ'

'అందరూ భోజనాలు చేసి బయట విస్తళ్లు పారేసారు. కుక్కలన్నీ వాటికోసం పోట్లాడుకుంటున్నాయి'

'ఊఁ'

'ఈ కుర్రాడు అక్కడ చేరాడు. కుక్కలన్నీ వీణ్ణిచూసి మొఱుగుతూ దూరంగా నిలిచాయి'

'ఊఁ'

'వీడు దానిలో ఉన్న అన్నాన్నంతా గీరడం మొదలుపెట్టాడు'

'ఛీ...ఛీ'

'మరి ఆకలేస్తుందామె! ఏం చేస్తాడు, పాపం'

'ఊఁ...తరువాత'

'అప్పుడు, బజారులో పిల్లలంతా ఆ అబ్బాయి చుట్టూ చేరి "కుక్కకూడు! కుక్క కూడు!" అని ఏడ్పించారు'

'ఊఁ'

'వాడు చిన్నవాడుగా!... పాపం, ఏంచేస్తాడు?...ఏడ్చాడు.

'ఊఁ'

ఈ లోగా ఒక పెద్దాయన వచ్చి అదంతా చూచి, అందరినీ కూకలేశాడు. 'పాపం, అన్నం దొరక్క కదా ఈ అవస్థ' అని జాలిపడ్డాడు. తనకొడుకు అక్కడుంటే ఇంటికి పిలుచుకొ పోయాడు.

'ఊఁ'

"ఆమర్నాడు మళ్లీ ఆబజారు లోనే ఇంటింటా అడుక్కుంటూ వచ్చాడు ఆ బీద అబ్బాయి."

ఆ క్రిందటిరోజున తననిచూచి జాలిపడిన పెద్దమనిషి యింటికి వచ్చాడు.

"ఊఁ"

వాళ్ల అబ్బాయి అరుగు మీద కూర్చుని ఉన్నాడు. వీణ్ని చూసి పరుగెత్తి లోని కెళ్లి "నాన్నా ... నాన్నా వాడు వచ్చాడు. కుక్క లబ్బాయి వచ్చాడు. మన ఇంట్లో అన్నం ఉందిగా కాస్త పెట్టకూడదూ?" అన్నాడు.

'ఊఁ'

'ఛా...వెధవ!'...అని అతడు రెండు బాది 'మడి కట్టుకున్నా తలుపు వేసిరా' అన్నాడు.

'భలే'

'చెప్పేదొకటి, చేసేదింకొకటి.'

'అవును. నిజమే! నీవన్నది 'కథ చెప్ప' నని; నీవు చేసింది కథ చెప్పావు! నీ లాంటివాడే ఆతండ్రికూడా, అయినా నేను చెబుదా మనుకున్న కథ ఇది కాదు.

'చాల్లే అబద్ధం'

'చెప్పనా మరి'

'చెప్పు చూద్దాం'

'నే చెప్పను!'




## ప రి ష్యా

అనగా అనగా పరిష్యాదేశంలో ఒక గొప్ప వర్తకు డుండేవాడు. అతను తివాసీల వర్తకం చేసి ఎంతో డబ్బు గడించాడు. పరిష్యాదేశపు తివాసీలు చాలా బాగుంటాయి, అనేక దేశాలలో వాటిని అమ్మి చాలా గొప్పవా డయ్యాడు.

ఆ వర్తకుడికి అబ్దుల్లా అని ఒకకొడుకున్నాడు. వాళ్ళనాన్నకి అమ్మకిఅబ్దుల్లా ఒక్కడేపిల్లవాడు అవటంచేత చిన్నప్పటి నుంచీ చాలా గారాబంగా పెంచేవారు. వర్తకుడికి చాలా డబ్బుంది కదూ, అంచేత ఒక మూడు అంతస్తుల మేడ, దానినిండా వెండి సామాన్లు, బంగారు సామానులు, గాజు బొమ్మలు, పింగాణీ బొమ్మలు అన్నీ వున్నాయి. ఎన్నో గుఱ్ఱాలు, ఒంటెలు కూడా వున్నాయి. అబ్దుల్లా మాట్లాడితేచాలు, ఇటునుంచి నలుగురు నౌఖర్లు అటునుంచి నలుగురు పరుగెత్తుకు వచ్చేవారు. ఏదేనా అడిగే సరికల్లా పట్టుకొచ్చి ఇచ్చేవారు. ఎక్కడికేనా వెళ్ళాలీ అంటే, నాలుగు గుఱ్ఱాల బండి, ముందర ఇద్దరు జవానులు వెనకాల ఇద్దరు. అలా వుండేది.

ఇంక చదువుకోటానికి, వాళ్ళ పరిష్యాభాష చెప్పటానికి ఒక మేష్టరు, లెక్కలు చెప్పటానికి ఇంకొకరు, బొమ్మలు వెయ్యటం నేర్పటానికి మరొక మేష్టరు, ఇలాగ అనేకమంది మేష్టర్లు ఇంటికే వచ్చి అబ్దుల్లాకు చదువు చెప్పేవారు. వాళ్ళ నాన్న అమ్మ అతన్ని గారాబంగా చూడటం చేత అబ్దుల్లా, అందరు తను ఏది చెబితే అది చెయ్యాలనేవాడు. ఈ వేళ నేను చదువుకోనూ అంటే మేష్టర్లు వెళ్ళి పోవలసిందే! ఇలాగ జరుగుతూ వుండేది. దానితోటి అబ్దుల్లాకు, వయస్సులో చిన్నవాడైనా, గర్వం మాత్రం ఎక్కువైంది. తనంతటివాడు లేడని, అంతా తన మాట ప్రకారం నడవాలని అనుకునేవాడు.

ఇలావుండగా ఒకరోజున ఏమైందీ— వాళ్ళనాన్నగారు, ఈజిప్టుదేశం వర్తకం

కోసం వెళ్ళినప్పుడు, అక్కడనుంచి ఒక మంచి అద్దం తీసుకొని వచ్చారు. అది ఆన ఆఫీసు గదులో బల్లమీద చుట్టూ నగిషీ చెక్కిన దంతం చట్రంలో అమర్చి పెట్టుకున్నారు. చూడటానికి, తళతళా మెరిసిపోతూ వుండేది. వాళ్ళ ఇంటికి వచ్చిన వాళ్ళంతా ఎక్కడనుంచి తెచ్చారంటే, ఎక్కడనుంచి తెచ్చారని అడుగుతూ వుండేవారు.

అబ్దుల్లా ఒకరోజున, ఎవరూ లేనప్పుడు వాళ్ళ నాన్నగారి ఆఫీసు గదులో కెళ్ళాడు. బల్లమీద అమర్చిన ఆ అద్దం కనిపించింది. దగ్గరకెళ్ళి చూశాడు. అందులో సరిగ్గా తనలాగేవున్న పిల్లాడు కనిపించేడు. నాలికచాపి "ఎల్లెల్లే" అని వెక్కిరించాడు. ఆ అద్దంలో పిల్లాడు కూడా వెక్కిరించాడు. దానితోటి అబ్దుల్లాకి కోపం వచ్చింది. 'నా అంతటి వాడిని, వీడెవడో వచ్చి మళ్ళీ వెక్కిరిస్తాడా' అని గబగబా ఆ గదిలోంచి అవతలికి వెళ్ళి, ఒక పెద్దరాయివుంటే అది తెచ్చి ఒక్క దెబ్బ వేశాడు 'అయిందా నీపని, ఇంకెప్పుడూ వెక్కిరించవు కదా' అంటూను. రాయి పుచ్చుకు కొట్టేసరికి పెద్ద చప్పుడు వినిపించింది. ఏఁవిటో అనుకుని వాళ్లనాన్న పరుగెత్తుకు వచ్చాడు. చూస్తే ఏముంది? తను అంత కష్టపడి తెచ్చిన అద్దం ముక్కముక్కలైంది. అది చూసేసరికి ఎక్కడలేని కోపంవచ్చి, అబ్దుల్లాని ఒక్కటి కొట్టాడు ఎందుకు అలా చేశావని. "ఆఁ! ఆ పిల్లాడు వెక్కిరిస్తే వూరుకుంటానా?" అన్నాడు అబ్దుల్లా. ఆమాట వినేసరికి తండ్రికి నవ్వొచ్చింది. "అద్దంలో కనిపించేది, నీ బొమ్మే అని ఆమాత్రం తెలుసుకోలేకపోయావు. ఇంత చిన్నతనంలోనే ఇంత గర్వం వచ్చిందా నీకు! ఇంకనుంచి నువ్వు వీధి బడిలోకి వెళ్ళి అందరు పిల్లలతోటి కలిసిచదువుకుని బుద్ధితెచ్చుకో" అన్నాడు. ఆ రోజునుంచి అబ్దుల్లా గర్వం అణిగింది.


## మీ బిడ్డలు

మీ బిడ్డల మనస్తత్వమును తెలుసుకొని దానికి తగిన ధోరణిలో విద్య చెప్పించండి. జాతకమునుగాని, పుట్టిన తేది, టైము గాని తెలియబఱచి 0-12-0 స్టాంపులతో యీ క్రింది అడ్రసుకు వ్రాయండి.

మీ బిడ్డకు యెటువంటి విషయాలలో బుద్ధి పోతుందో, యెటువంటి సాహిత్యమిస్తే, అభివృద్ధిలోకి వస్తుందో తెలియజేస్తాను.

"రా ఫేల్"

రూము నె 99 రు,—110, ఆచారప్పన్ వీధి, జి. టి., మద్రాసు.

రహస్యం! రహస్యం!

# పెన్సిలు మేజిక్కు!

బచ్చు నారాయణమూర్తి, బరంపురం.

[క్రిస్మస్ సెలవ లొస్తున్నాయి. యీ మేజిక్కు నేర్చుకోండి. వచ్చే నెల ఇంకో మేజిక్కు వేస్తాం, ఎదురుచూడండి—సం.॥]

"బాల"లో మిఠాయి మేజిక్కు చదివాను. ఆ రోజునుంచీ నాకు మేజిక్కు నేర్చుకోవాలని బుద్ధి పుట్టింది. మా ఊరికి ఒక గారడీవాడు వస్తే వాడి దగ్గరికి వెళ్ళాను.

గారడీ అంతా చూచాను. గారడీ అయిపోయిం తరువాత అందరూ వెళ్ళిపోయారు. నేను ఇంకా అక్కడే నిలుచున్నాను.

"ఏం అబ్బాయి? ఎందుకు ఇక్కడ నిలుచున్నావూ?" అని అడిగేడు గారడీ వాడు.

"నాకు గారడీ నేర్పుతావా?" అని అడిగాను.

"మా గురువుగారి ఆజ్ఞ లేనిదే నేర్పను" అన్నాడు.

నేను ఎంతో బ్రతిమాలుతే ఒక పెన్సిలు తీసి ఇచ్చాడు. నా చెవులో రహశ్యం చెప్పాడు.

సరే-ఇంకేం! తిన్నగా ఇంటికి వచ్చాను. మా పద్మ, రామం, బాబులూ అందర్నీ పిలిచాను.

"ఇదుగో నేను మేజిక్కు చేస్తాను చూడండి," అన్నాను గర్వంగా.

"ఏమి మేజిక్కు?"-అని అడిగింది మా పద్మ.

"పెన్సిలు మేజిక్కు.... ఇదుగో చూశారా ఈ రంగు రంగుల పెన్సిలు!"—అని పెన్సిలు చూపించాను.

"ఒస్! ఇందులో గొప్పేముంది.... ఏదీ ఇలాతే రాసి చూస్తా"—అన్నాడు మా రామం.

పెన్సిలు తీసి కాగితంమీద గీత గీశాడు. నల్లగా గీత పడింది.

"చూశారా! ఈ పెన్సిలు ఇప్పుడు మామూలుగా నల్లగా రాస్తుంది. కాని ఇప్పుడు నేను చేసే మేజిక్కు ఏమిటంటే-ఈ పెన్సిలుతోనే మీరు ఏ రంగు కోరితే ఆ రంగు రాస్తాను!" అన్నాను ఇంకా గర్వంగా.

"ఎఱుపు" అన్నది పద్మ.

"పసుపు" అన్నాడు రామం.

"నీలి" అన్నాడు బాబులు.

"ఇలాకాదు మీరందరూ కలిసి ఒకే రంగు చెప్పండి రాస్తాను"—అన్నాను నేను.

"అయితే ఆకుపచ్చ వ్రాయిమీ చూద్దాం!"—అని అన్నారు.

"హ్రాం! హ్రీం! హ్రూం! మంత్రం వేశాను. పెన్సిలుని చేత్తో గిరగిర తిప్పి, ఫూ అని ఊదాను, ఒక తెల్లని కాగితం తీశాను.

"ఏ రంగు? ఆకుపచ్చ కదూ?"—అని మళ్ళీ అడిగేను.

"అవును ఆ కు ప చ్చ" అన్నారు.

వెంటనే కాగితంమీద "ఆకుపచ్చ" అని పెన్సిలుతో వ్రాశాను.

"ఇదేమిటీ!" అన్నారు.

"మీరు ఆకుపచ్చ రాయమన్నారుగా! ఇదుగో 'ఆకుపచ్చ' అనే రాశాను!"—అన్నాను ధీమాగా, గొప్పగా, గర్వంగా,

అందరూ గొల్లున నవ్వారు!

"ఈ మేజిక్కు నేనూ చేయగలను"—అంది మా పద్మ.


# జనవరి "బాల" - సంక్రాంతి సంచిక!

అనేక రంగు రంగు బొమ్మలతో,

చిత్రమైన ముగ్గులతో,

చక్కని కథలతో

అనేక గమ్మత్తులతో

వస్తోంది! వస్తోంది!!

వెల 0—12—0 మాత్రమే

కావలసిన వారు వెంటనే వ్రాయండి.

మేనేజరు "బాల"

20, సుందరేశ్వర్ వీధి, మైలాపూరు.

అల్లం బెల్లం కథ :

# ఎవరు తెలివిగలవారు?

ఒక ఊళ్ళో ఓ గొప్ప ధనవంతు డున్నాడు అతనికి లేక లేక ఒక కొడుకు కలిగేడు. ఆ కొడుకుని ఎంతో ముద్దుగా పెంచారు. ఆ అబ్బాయిని బడికి పంపక, ఇంట్లోనే మేష్టారుని పెట్టి చదివిస్తున్నారు.

ఓ రోజు, మేష్టారు, ఆ అబ్బాయికి పాఠం చెబుతూవుండగా, వాని తండ్రి ఆ రోజు అక్కడే కూర్చున్నాడట. ఆ పాఠంలో "అల్లం" గురించి వచ్చిందట. అప్పుడు మేష్టారు ఆ అబ్బాయిని "అల్లం ఏ రుచిగా వుంటుందని" అడిగారు.

"అల్లం పుల్లగా వుంటుంది సార్!"—అన్నాట్ట అబ్బాయి.

మేష్టారు ఫక్కున నవ్వేడు.

తండ్రికి ఉక్కురోషం వచ్చింది. కొడుకు చెప్పిన తప్పు సర్దుకోటాని కని :

"మేష్టారూ! మా అబ్బాయి మీరు అడిగింది బెల్లం అనుకున్నాడండీ"—అన్నాడట!

సంపాదన : బొగ్గవరపు సోమేశ్వరరావు,
కాకినాడ.

# ఏమి కల్వ?

నల్ల నల్ల
ఏమి నల్ల ?
బొగ్గు నల్ల
ఏమి బొగ్గు
కట్టె బొగ్గు.
ఏమి కట్టె
జామి కట్టె.
ఏమి జామి
అంటు జామి
ఏమి అంటు
మల్లె అంటు
ఏమి మల్లె
బొడ్డు మల్లె
ఏమి బొడ్డు
కల్వ బొడ్డు
ఏమి కల్వ
చెంగల్వ!

సంపాదన : కోకా లీల, రేపల్లె.

## ఈ పకోడి పొట్లం చూశారా?

ప కో డి
కో డి
డి

[మా వూళ్లో కానీ ఇస్తే ఇంత పకోడీల పొట్లం ఇస్తారు.]

—ఏ. ధర్మారావు, మూడోఫారం,
రాజమహేంద్రవరం.

---

## పిడత

రచన : కోనే, పరమేశ్ బాబు
(12 సం॥ లు)

రామారావు బయలుదేరాడు తన పిల్లలకు పిడతలు కొంటానికి. పిడత లమ్మేచోటుకు వెళ్ళి పిడతలు కొన్నాడు. అందులో ఒక పిడత కొంచెము పగిలివుంది. ఆ పిడతనుచూసి రామారావు అన్నాడు, ఆ కొట్టు యజమానితో :

"అయ్యా! ఈ పిడత పోయినది. ఇంకొక పిడత ఇవ్వండి" అని.

అప్పుడా యజమాని అన్నాడుకదా! "ఏమయ్యా! మీరు పెద్దమనుష్యులేనా? ఆ పిడత ఎక్కడకు పోయిందయ్యా? అది మీ చేతుల్లోనే ఉందిగా? అని దబాయించి అన్నాడు.



# అక్కతో 5 నిమిషాలు

మొదట్లో 'బాల' సంపాదకులను ప్రతినెలా ఒకటి రెండు పేజీలు మాత్రం ఈ సంచికలో మనకి స్థలం ఇమ్మని నేను కోరాను. అలాగే అని ఇచ్చేరు. తరువాత మన బాల సంఘాలు స్థాపించడం, అవి చేస్తున్న పనులను గురించి వేయడం ప్రారంభించాను. ఆ కారణంచేత మన రెండు పేజీలు రాను రాను నాలుగు పేజీలుగా పెరిగింది.

"ఏమండోయ్ అక్కగారూ? ఎడారిలో ఒంటె మాదిరిగా, మెల్ల మెల్లగా మా పత్రికంతా మీరే ఆక్రమిస్తున్నారే"—అని "బాల" సంపాదకులు మొన్న నన్నడిగేరు.

"తుపానులో బాధ పడ్డ వారిని గురించి మన తెలుగు పిల్లలు కష్టపడి చందాలు వసూలు చేశారు. వారిని గురించి కూడా వేయకపోతే ఎలాగండీ"—అని అన్నాను.

"అవునవును మీ బాల సంఘాలు బాగానే పని చేస్తున్నాయి." కాని ఇంకా చురుకుగా పని చేయాలి అంటూ నా చేతికి ఒక బరువైన కవరు ఇచ్చారు.

"ఇదేమి టండోయ్"—అని అడిగేను.

"మీ తుపాను నిధికి 'బాల చందా'" అంటూ వెళ్ళిపోయారు

తుపాను నిధికి మన బాలలే కాకుండా పెద్దవారు కూడ సహాయ పడుతున్నందుకు చాల సంతోషం. భీమునిపట్నంలో శ్రీ దిట్టకవి లక్ష్మి మోహన్ రావు గారు అక్కడ మన బాల సంఘానికి ఎంతో తోడ్పడి మంచి విరాళం పంపారు. అలాగే ఇతర చోట్ల కూడా పెద్దలు పిల్లలకు సహాయం చేస్తారని నమ్ముతున్నాను.

* * *

బాల సంఘం పువ్వులు ఇంకా మొదలేదని రాస్తున్నారు. అవి పూరు కాగానే కొద్ది రోజుల్లో ప్రకటిస్తాం.

*　*　*

సంక్రాంతి పండుగ వస్తోంది. సంక్రాంతి చక్కని ముగ్గుల పండుగ. మనలో చక్కని ముగ్గులు వేసే వాళ్లు ఎందరో వున్నారు. మీరు ముగ్గులు వేసి పంపుతే మన "బాల"లో ప్రచురించడానికి ప్రయత్నిస్తాను. ఏమంటారు?

మళ్ళీ సంక్రాంతి సంచికలో కలుసుకుందాం—

ఇట్లు,

అక్క.

# బా ల సం ఘా లు

## బాలసంఘం, అప్పాజిరావుపేట

ఈ బాలసంఘంలో 33 రు సభ్యులు గలరు. ఆటలు, పాటలు, కథలు ఆరోగ్య నిబంధనలు నేర్చుకొను చున్నారు. బెంగాలు, రాయలసీమ, విశాఖ కరువు బాధితులకు ధనసహాయము చేసిరి. బాల బాలసాహిత్యము తెప్పించుకొనుచున్నారు. ప్రెసిడెంటు కొండపల్లి సూర్యనారాయణ, కార్యదర్శి తాళ్ళూరి కాంతయ్య ప్రతివారము సమావేశమై విజ్ఞానాన్ని పెంపొందించు చున్నారు. చెడుగుడు పోటీలనుకూడా జరిపినారు.

## స్టూడెంట్సుక్లబ్బు కొర్సండ, పర్లాకిమిడి

శ్రీ డాక్టరు పోలాకి శ్రీనివాసరావు రచియించిన "శ్రీ త్రినాథవ్రత మాహాత్మ్యము" అను నాటకము బాలదర్శకత్వమునవే ఈ స్టూడెంట్సు క్లబ్బు వారు 19-11-45 తేదిని ప్రదర్శించి సర్వజనామోదమును బడసిరి.

## బాలానంద సంఘం, తిరుపతి

ఈ సంఘము 17-11-45 తేదీన మనోహరరావునాయుడు భవనమున స్థాపించబడినది. ప్రస్తుతము 15 మంది బాలురు సభ్యులుగ నున్నారు. అధ్యక్షుడు ఎస్. రాజారామ్, కార్యదర్శి ఈ. మనోహరరావు నాయుడు. ప్రతి నెల 20 తేదీ సభ జరుపుట 'బాల' పత్రికను తెప్పించుటకు నిశ్చయించిరి.

## బాలసంఘం, గార్ల

17-11-45 తేదిని సాయంకాలము 7 గంటలకు శ్రీ కొదుమూరి వెంకటేశ్వరరావు గారి అధ్యక్షతను సభ జరిగింది. బాలసంఘం పాటలు, ఆటలు నేర్చు

కొనుటకు, ప్రతివారం బాలురు వచ్చుటకు తీర్మానించుకున్నారు. శ్రీ కోదుమూరి వెంకటేశ్వరరావుగారిని అధ్యక్షులుగాను, శ్రీ నకిరెకంటి కృష్ణమూర్తిగారిని కార్యదర్శిగాను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

## సుల్తాన్ బాలానందసంఘం, భట్టిప్రోలు

12-11-1945 తేదిని సభ జరపడమైనది. ఎమ్. ఏ. లతీఫ్‌ని అధ్యక్షుడుగాను, ఎమ్. ఎ. ఆజం సుల్తాన్‌ని కార్యదర్శిగాను, సోదరులు ఎన్నుకొనిరి. వచ్చే నెల యందు సోదర మెంబర్లు చేయవలసినది సభ జరిపి తీర్మానించెదరు.

## బాలానందసంఘం, దార్లపూడి

18-11-45 తేదీని సంఘం సమావేశం అయింది. పిల్లలందరికీ 'బాల' చదివి వినిపించిరి. పిల్లల కొరకు ఒక లైబ్రరీ స్థాపించాలనీ, ప్రతి మెంబరు ఎక్కువ మంది పిల్లలను ప్రోత్సహించి బడికి వెళ్ళేలా చెయ్యాలనీ, ప్రతివాళ్లు ఆరోగ్యసూత్రాలను పాటించాలని తీర్మానించేరు. పిమ్మట జాతీయగీతములతోను, మంగళముతో సభ సమాప్తిచేయబడినది.

## బాలానందసంఘం, భీమునిపట్నం

మూడవ బాలానందసభ 25-11-45 తేదిని శ్రీ కలిగొట్ల భాస్కరరావుగారి అధ్యక్షతను జరుపబడెను. ఈ నెలలో ఈసంఘమువారు శ్రీ చిట్టకవి లక్ష్మీమోహనరావుగారి సహాయముతో బహుశ్రద్ధతో తూర్పుకోస్తా తుపాను గూర్చి అనేకులకు బోధించి, తుపానువల్ల బాధకలిగిన ప్రజలకు నిధి రు. 21-6-0 వసూలుచేసిరి. సభ మంగళముతో ముగింపబడెను.

## నవంబరు నెలలో చేరిన "బాలానంద" సభ్యులు

### భీమునిపట్నం

విచ్చర్ల సత్యనందాచారి; కట్టమూరి రామకృష్ణాచారి; ముకర నారాయణరావు; కోసూరి రామస్వామి; బుంగా సూర్యనారాయణ.

### శ్రీకాకుళం

గుడివాడ లక్ష్మీ నరసాయమ్మ; గుడివాడ రత్నమాల; గుడివాడ సుబ్బరత్నము; గుడివాడ వరదరాజులు.

### మద్రాసు

వారణాసి సుబ్రహ్మణ్యం; పుణ్యమూర్తుల నరసింహమూర్తి; పుణ్యమూర్తుల మోహన్‌కృష్ణ.

### దార్లపూడి

సి హెచ్. పార్వతి; సి హెచ్. బుచ్చి సీతమ్మ; సి హెచ్. సత్యవతి; పి. లక్ష్మణస్వామి; సి హెచ్. అప్పల నరసమ్మ; బి. వరహాలమ్మ; బి. రామారావు; వి. లక్ష్మీదేవి; వి. సూర్యకాంతం.

# తూర్పుకోస్తా తుపానునిధి

భీమునిపట్నం బాలానంద సంఘంవారు, ఈదిగువ వివరించిన వారివద్దనుండి, తుపానునిధికి వసూలుచేసి పంపేరు.

శ్రీ కలిగొట్ల సూర్యనారాయణ నాయుడుగారు 1-0-0, అప్పికొండ రామారావుగారు 1-0-0, యేడిద సూర్యనారాయణగారు 1-0-0, నాళం సోమలింగంగారు 1-0-0, మోగంటి పద్మనాభ స్వామిగారు 1-0-0, వి. అప్పల రాజుగారు, 1-0-0 పులవర్తి తరుణయ్యగారు 1-0-0, కట్టమూరి వెంకన్నచెట్టిగారు 1-0-0, యేకుల జగ్గారావుగారు 1-0-0, మొగసాల సన్యాసయ్యగారు 1-0-0, కనుమూరి వెంకటరాజుగారు 1-0-0, ఎమ్. వి. రమణమూర్తిగారు 1-0-0, డి. ఎల్. మోహనరావుగారు 0-10-0, రంగుబోమ అప్పలస్వామిగారు 0-8-0, లి. మల్లేశ్వరరావుగారు 0-8-0, కె. శివరామయణ్యగారు 0-8-0, గంపా అప్పలకొండగారు 0-8-0, ఎమ్. ఎస్. రాజుగారు 0-8-0, బి. పేర్రాజుగారు 0-8-0, డి. వి. సత్యనారాయణగారు 0-8-0, వుశిరికల సత్యనారాయణగారు 0-8-0, జి. వెంకటరావు, పైడి శెట్టిగార్లు 0-8-0, కె. రమణయ్యలుగారు 0-8-0, ఎస్. వి. రమణయ్యగారు 0-8-0, పి. వెంకటరావుగారు 0-8-0, జి. వి. రంగనాయకులుగారు 0-8-0, గోడే కామేశ్వరరావుగారు 0-8-0, డి. వి. కె. వర్మగారు 0-8-0. బి. కొండయ్యగారు 0-8-0, ఎ. అల్లిపిల్లి అప్పలస్వామిగారు 0-4-0, కట్టమూరి శ్రీరామమూర్తిగారు 0-4-0, వుప్పుల సన్యాసయ్యగారు 0-4-0, వి. బుచ్చిరాజుగారు 0-4-0. మొత్తము వసూలు 21-6-0

| | |
|---|---|
| మనియార్డరు ఖర్చు 0-6-0, పోనూ మిగత | 21-0-0 |
| టిటాఘర్‌నుంచి ఇద్దిమి అప్పన్న సేనాపతిగారు | 5-0-0 |
| కాకినాడనుంచి చి॥ బొగ్గవరపు వీరరంగవల్లి కుసుమ కుమారి | 1-0-0 |
| "బాల" సంపాదకులు విరాళము | 20-0-0 |
| మొత్తము రూ. | 47-0-0 |

తే 6-12-45-దీన ఆంధ్రప్రభ తూర్పుకోస్తానిధికి చెక్కుద్వారా పంపినది 47-0-0

# రెక్కలొస్తే

కవికొండల వేంకటరావు

"అమ్మా! నాకు రెక్కలొస్తే నేనేలాగు నుంటానే?" అని తల్లిని కొడుకు అడిగాడు. "నాన్న లాగుంటావు. నాకు బువ్వెడ తావు, నాలుగు రాళ్లు తెస్తావు, నలుగుర్ని సుఖపెడతావు." అంది ముచ్చటగా తల్లి.

కొడుకు: "నాన్న లాగుండను. నీకు బువ్వెట్టను. నాలుగు రాళ్లు తేను. నలుగుర్ని సుఖ పెట్టను.—చిలకలా గుంటాను. జామిపళ్లు తింటాను. ఆకుపచ్చ రెక్కలాతో అందమైన రెక్క లాతో, మాకులందు దాగుడాట లాడుకుంటు, ఆకాశమందు కుంటా! నాన్నలాగు గ్రుచ్చుకునే మీసా లెవరిక్కావాలి? నాన్న లాగు నెరిసిపోయే నెత్తీ, జుత్తూ ఎవరిక్కావాలి?

చిలకను కాను. చిలకను కాను — కోయిల నవుతాను. కోకో అంటూ. ఎక్కడ వసంత ముంటే అక్కడ కొమ్మెక్కి వేరెమ్మాగీ ఆనందిస్తా. రెక్కలు వస్తే చిలకను కానేవ్! కోయిల నవుతానేవ్! అమ్మా! నాన్న లాగు గ్రుచ్చుకునే మీసా లెవరి క్కావాలి? నాన్నలాగు నెరిసి పోయే నెత్తీ జుత్తూ ఎవరి క్కావాలి?...

కోయిల నవనేవ్! కోయిల నవనేవ్!—భరద్వాజ పక్షిని నేనవుతా! కొండల్లోనే గూడు కట్టుకోని, తెల తెలవారేలో మేలుకొని, అవలీలగ సూర్యో దయ మందటికంటె ముందటి కనుగొని, స్వర్గం పాటలు పాడ్తా! నాన్నలాగ గుచ్చుకునే మీసా లెవరి క్కావాలి? నాన్నలాగు నెరిసిపోయే నెత్తీ జుత్తూ ఎవరి క్కావాలి?...

కానేవ్! భరద్వాజ పక్షిని కానేవ్! అమ్మా భరద్వాజ

పక్షిని కానేవ్! నాకే తెక్కలు వచ్చాయంటే, ఏరోప్లేన్నై—
ఇజ్ ఇజ్! అంటూ,
బబజ్ జ్! అంటూ,
గుడగుడ మంటూ,
బడబడ మంటూ,
పట్నం పట్నం పయనంచేస్తా!
నాన్నలాగు నాకు గ్రుచ్చుకునే మీసాలేం ఖర్మం? నాన్నలాగు నాకు నెరిసే నెత్తీ, జుత్తూ యేం పాపం? అదుగో! అదుగో! ఏరోప్లేను! ఆకాశం మీద అదెవరు? అమ్మా!"

"మీ నాన్నే! నాన్నే! ఏరోప్లేన్లోంచే దిగుతున్నాడ్రోయి! యుద్ధంచేసి వస్తున్నాడ్రోయి! నిన్ను ముద్దెట్టుకొని ఏరోప్లేనులో పంపిస్తాడ్రోయి!"

"నన్నే! నాన్నే?"—

"నిన్నెక్కడకు పంపనిస్తాను? నిన్నెందుకు పంపనిస్తాను?"


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు :—

డా॥ పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,
11. దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

| కుంభకోణం బ్రాంచి : | తిరుచినాపల్లి బ్రాంచి ; |
| --- | --- |
| నెం. 7, సారంగపాణి కోవిల్, తూర్పువీధి. | నెం. 15, పుగళై పిళ్ళై వీధి, తెప్పకొలం. |




నాట్యశ్రీ కళానిధి

# కుమారీ నాళం అమృతం

[ 'బాల' విలేఖరి ]

ఈ రోజుల్లో ఆ మాత్రం యీ మాత్రం సరదా వున్న ప్రతి తలిదండ్రి తమ చిట్టమ్మాయిలకు నాట్యం నేర్పిస్తున్నారు. కాని ఒక్క పదేళ్లకుపూర్వం చూచామంటే అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు కలిగిందో తెలుస్తుంది. అప్పుడు ఆడపిల్లలకి నాట్యంనేర్పిస్తే అదో పెద్దతప్పు!

అటువంటి రోజుల్లో ధైర్యం చేసి, ముందంజవేసి, తమ పిల్లలకి భరతనాట్యం నేర్పించిన వారిలో ఒకరు శ్రీ నాళం రామలింగేశ్వర రావుగారూ, వారి భార్య శ్రీ రాఘవమ్మగారు. వైశ్యులైనప్పటికి, కులం వారి



పోలు మాటలకు లెక్క చేయక, తమ పిల్లకు భరతనాట్యం నేర్పించుట ఎంతో మెచ్చుకోదగిన విషయము.



కుమారీ అమృతం చక్కగా నృత్యం చేస్తుంది. నేర్చుకోడం మొదలు పెట్టిన ఒక సంవత్సరం లోపుగానే మూడు గంటలసేపు ఆడగలిగే విద్య నేర్చుకుంది.

“ఏం, అమృతం ఏదీ నీవు సంపాదించిన బహుమానాలు చూపించూ” అని అడిగేను. బీరువా తీసి ఇన్ని బంగారు పతకాలూ, వెండి కప్పులూ, “నాట్యశ్రీ”, “కళానిధి” బిరుదు పత్రాలు-ఇంకా ఏవేవో అన్నీ చూపించింది. అందులో చెన్నపురి ఆంధ్రమహాజన సభవారు, రాజమండ్రి ఆంధ్ర మహిళా గాన సభవారు, కలకత్తా అరోరా ఫిలుం డైరెక్టరు శ్రీ నిరంజనపాల్ గారు, దక్షిణ ఇండియా వైశ్య సంఘము వారు, ఆంధ్ర నాటక కళా పరిషత్తు వారు, ఆర్య వైశ్య కవిపండిత పరిషత్తువారు, మదరాసు ఆంధ్ర విజ్ఞాన సమితివారు, మదరాసు ఆంధ్ర మహిళా సభవారు ఇచ్చిన బహుమానాలు ఎన్నో కనబడ్డాయి. అవి చూచాక

నాకు కూడా భరత నాట్యం నేర్చుకోవాలని బుద్ధి పుట్టింది!

"అయితే ఇప్పుడేం చేస్తున్నావు అమృతం?" — అని అడిగేను.

"మొన్ననే స్కూలు ఫైనలు పరీక్ష పాసయాను. ఇప్పుడు మా ఇంట్లో మా అమ్మా మా నాన్నగారు నడుపుతున్న పిల్లల సంఘంలోని పిల్లలకు భరత నాట్యం నేనే నేర్పుతున్నాను. అదిగాక ఇప్పుడు గాత్రపాట కూడా నేర్చుకొని, యీ ఏడు పరీక్షకు వెళ్తున్నాను"—అంది అతి వినయంగా.

"సరే—ఇంతేనా ఇంకేవేనా విద్యలు వచ్చునా?" — అని అడిగేను.

"నేను వీణ కూడా వాయించగలను. మా అన్న రమేష్ ఫిడేలు వాయిస్తే, నేను వానితో కలిసి వీణ వాయిస్తాను."— అంది.

అదంతా విని నాకెంతో ముచ్చట వేసింది.


నేషనల్ ఇండియన్ లైఫ్

ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్

పిల్లల బాగుకోరు ప్రతి తల్లియూ, తండ్రియూ

తమ జీవితములను

భీమా చేయవలెను.

నవీన పద్ధతులు! తేలిక రేట్లు!

వివరములకు:

శ్రీ టి. వి. రాఘవయ్య,


శెక్రటరీ,

National Indian Life Insurance Co, Ltd.,

334, Thambu Chetty Street, G. T., Madras.

# ఆరోగ్య వాచకము

మొదటి తరగతి




## ఇల్లు —

గాలి వెల్తురు తోడ -
దూలు చుండిన ఇంట
చెత్త పెంటలు లేక
చెలగు చుండెడి ఇంట
మురికి గోతులు లేక
మురియుచుండెడి ఇంట
పూల మొక్కలు చెంత
పూయు చుండెడి ఇంట
కాపురంబును చేయ
గలుగు నారోగ్యం.

రచయిత;

డాక్టరు పోలాకి శ్రీనివాసరావు,

బూరవెల్లి.



[అన్నిహక్కులూ రచయితవి]

# బాలకిష్టమ్మ

కిష్టమ్మ! కిష్టమ్మ!
బాల కిష్టమ్మ -
పాలు పెరుగూ దొంగి
లించుకుంటాడు -
యమున ఒడ్డున జేరి
మురళి పట్టేడూ -
చల్ల చల్లగ ఊది
చేర బిలచేడూ -
యేమి విడ్డూరమో
యేవింతో యనుచూ -
మాయ కిష్టమ్మనీ
చేరకున్నామూ -
చల్లకడవలకెల్ల
చిల్లులెట్టాడూ -
పెరుగు పాలంతటిని
పార బోశాడూ -
చూడు యశోదమ్మ
చూడవోయమ్మా -
మీ కన్న కొడుకునిక
మందలించమ్మా! -

సంపాదన :—సూరిశెట్టి సాంబశివరావ్ బాబ్జీ
బెంగుళూరు.

# చుక్కలు! చుక్కలు

సూరపురాజు సత్యనారాయణ,
(సేవాసమితి) కర్నూలు.

చుక్కలు! చుక్కలు!
ఆకాశమునా
అర్ధరాత్రిలో
మినుక్కు మినుక్కు
చుక్కలు - చుక్కలు!

* * *

ఆకాశములో
అర్ధరాత్రిలో
చుక్కలు చంద్రుడు
మినుక్కు మినుక్కు
దొంగల గుండెలో
కలుక్కు కలుక్కు!

# గాలీవానా వస్తే కథేలేదు

అనగా అనగా ఒక రాజున్నాడు. ఆ రాజుకు కథలంటే చాలా ఇష్టం. ఒకరోజు చాలా మందిని పిలిచి "నాకు ఎన్ని రోజులైనా అంతులేని కథ చెప్పాలి" అని అన్నాడు.

వెంటనే ప్రజలలో నుంచి ఒకడు లేచి నుంచున్నాడు. "నేను చెపుతాను. అయితే ఒక షరతుంది. అదేమిటంటే నేను చెప్పే కథను బంగారపు పని చేసే వాళ్ళెవరూ వినకూడదు" అని అన్నాడు. రాజు "సరే" నని తనకు తెలిసినంత వరకూ బంగారపు పని చేసేవారి నందర్నీ బయటకు పంపేడు.

ఇంక కథ మొదలు పెట్టాడు. "అనగా, అనగా, ఒక అడవి ఉంది. అందులో ఒక ఆకు, ఒక మట్టిగడ్డ చాలా స్నేహంగా ఉంటున్నాయి. ఎప్పుడూ కూడా ఒకరిని విడిచి ఒక రుండేవారు కారు. వర్షం వచ్చినప్పుడు మట్టి గడ్డ తడిసి కరిగి పోకుండా ఆకు మట్టిగడ్డమీద పడి మట్టిగడ్డను కాపాడుతోంది. గాలి వచ్చి నప్పుడు ఆకుమీద మట్టిగడ్డ పడి ఆకు ఎగిరి పోకుండా కాపాడు తోంది."

ఇంతలో మధ్యనుంచి ఒకా యన లేచి: "గాలి, వాన రెండూ వస్తేనో?" అని అన్నాడు.

"అదుగో ఆ ప్రశ్న అడిగే శారూ? ఇటువంటి ప్రశ్నను వేస్తారని నాకు తెలుసు. అందు చేత మొదట్లో నే చెప్పాను బంగారపు పని చేసే వారుండ కూడదని. గాలీ వానా వస్తే కథే లేదు." అన్నాడు.

సంపాదన: లవణం, (ముదునూరు)

---

అట్టమీద బొమ్మ:

చి|| పాలూరి కాశికాంబ

(అనకాపల్లి)

పేరుకి తగినట్టుగానే, తన చింపిరి జుత్తుతో యీ వెర్రి లోకాన్ని చిరునవ్వుతో చూస్తోంది. ఆ చూపులోనే తెలుస్తుంది ఆ అమ్మాయి చిలిపిచేష్టలు. వయస్సు ఎంతో లేదు: రెండో యేడు.



# అప్పాజీ నవ్వులు

జరుగుమిల్లి కుక్కుటేశ్వరరావు

అప్పాజి అప్పాజి
మంచాడురా!
అప్పాజి కడుపులో
పాటలున్నాయిరా!
అబ్బాయి అబ్బాయి
మంచాడురా!
దేముడే కితకితలు
పెడతాడురా!
అంచాతె నవ్వుతూ
ఉంటాడురా!
అప్పాజి అప్పాజి
మంచాడురా!
అప్పాజి బళ్లోకి
వెడతాడురా!
పలకలెన్నో విరగ
కొడతాడురా!

* * *

అబ్బాయి సిబ్బంది
కెడతాడురా!
తల్లికీ స్వాతంత్ర
మిస్తాడురా!
అప్పాజి బొజ్జలో
ఎందరో గాంధీలు,
వేయి శివాజీలు,
ఒక లక్ష రాణాలు!
మీసాలు మెలిపెట్టు
తుంటారు రా!
అప్పాజి అప్పాజి
మంచాడురా!
అప్పాజి కుర్రాళ్ళ
కాణి ముత్యమ్మురా
అప్పాజి నిద్రలో
నవ్వుకుంటాడురా!
ఆకసపు మెరుపులే
ఆ నవ్వు వెలుగురా!

* * *

అప్పాజి అప్పాజి
మంచాడురా!



# ఇది చెప్పుకో చూద్దాం!

## డిసెంబరు ప్రశ్నలు

### I

### ఏడు దమ్మిడీలు

ఏడు దమ్మిడీలు యీ దిగువ పేర్చినట్లు రెండు వరుసలుగా పేర్చండి.

○ ○ ○

○ ○ ○ ○

ఇందులో ఏ ఒక్క దమ్మిడీ అయినా తీసి, దానిని ఇంకో స్థలములో పెట్టాలి. అప్పుడు ఒక వరుసకు మూడేసి దమ్మిడీలు చొప్పున అయిదు వరుసలు వచ్చేటట్టు పేర్చగలరా?

### II

నేను మూడు మాటలలో "అమ్మ"ని "నాన్న"గా మార్చేను చూడండి;

అమ్మ
అన్న
నాన్న

ఈ విధంగా, మాటకీ, మాటకీ ఒక్కొక్క అక్షరమే మార్చుచూ, మార్చిన మాటలకు అర్థంవుంటూ, "ఆవు"ని "కోతి"గా చేయగలరా?

### III

### అక్షరమాల

నేను అయిదు అక్షరముల అడవి జంతువను.

1, 2, 5—కత్తి

3, 4, 5—లేడి


5, 1, 5—మోము

నేనెవరు?

# నవంబరు 'బాల' లోని ప్రశ్నలకు జవాబులు

I

అగ్గిపుల్లల తమాషా



II

| |
|---:|
| 218 |
| 489 |
| 88 |
| 857 |
| 1652 |

III

అక్షరమాల

మహాభారతము

మూడు ప్రశ్నలూ పంపినవారు

మదరాసు :

జయా; వై. పి. చందర్; శ్రీపతి కల్పకం; శ్రీపతి రాధాకృష్ణ; శ్రీపతి సీతాపతి; అడిదము హనుమద్వేంకట సుబ్బారావు; ఆర్. వి. సుశీల; అంగర వెంకట రమణారావు; అంగర సత్యనారాయణరావు.

బెజవాడ :

దా. వెం. సూర్యనారాయణరావు.

రాజమహేంద్రవరము :

ఎస్. వెంకటరావు; పి.ఆర్. మహర్షి.

హిందుపురము :

కట్టా వి. శ్రీరామయ్య.

తుని :

అవసరాల రామకృష్ణరావు; ఎస్.వి. చూడామణి; పెదపూడి రామశాస్త్రి.

విజయనగరం :

బి. సరోజిని; మేడేపల్లి వరహానరసింగరావు; మేడేపల్లి జగ్గమ్మ; టి. వి. రంగనాధాచారి; టి. పద్మనాయకి.

మానేపల్లి :

గుర్గాకుమారి.

బరంపురం :

యస్. వి. రంగశాయి; పి. చిదంబరశాస్త్రి; పూడిపెద్ది సత్యనారాయణమూర్తి; మామిడెన్న వెంకట విమలాదేవి.

శ్రీకాకుళము :

సీతంరాజు విజయలక్ష్మి.

అనకాపల్లి :

శ్రీధరాల జోగారావు.

న్యూఢిల్లీ :

వావిలకొలను కృష్ణకుమారి.

...

## రెండు ప్రశ్నలు మాత్రమే సరిగా పంపినవారు

మద్రాసు :

సి. సుబ్బారావు; సి. ఎల్. నారాయణ; ముళ్లపూడి వెంకటరమణ; ఆ. నరసింహమూర్తి; ఆ. సుబ్బలక్ష్మి; కె. ప్రభాకర్; పి. విమల; పి. మోహన్; పి. ఇందుమతి; ఎ. శ్రీహరి; కె. సరళ; పి. నిరంజన్; ఎ. శ్రీలత; టి. రాజేంద్ర; డి. పాండురంగ; పి. అభిరాం; ధర్మవరం స్వర్ణలత; డి. తులసీదేవి; యం. లక్ష్మీప్రసాద్; డి. వి. జె. విఠల్; పి. వెంకటరమణ; బి. రమణమూర్తి; డి. రుక్; మా. సీతామహాలక్ష్మి; స. వినాయకరావు; కామరాజు మృణాళిని; చిం. సీతారామారావు; కా. మధుచందర్; కా. యోగీశ్వర్; వి. రాజమన్నారు; డి. గణపతిరావు; డి. అనసూయ; డి. శేషగిరిరావు; టి. అచ్యుతం; టి. జానకిరాం; బి. ధర్మాబాయి; బి. చంద్రభాస్కర్; బి. శ్రీనాథులు; ఎస్. శ్యామల; సి. కె. గోవర్ధన్; సి. కె. నాగభూషణం; సి. కె. రాజ్యలక్ష్మి; గో. పాండురంగారావు; గో. లలితకుమారి; పా. వెంకటరమణమ్మ; పా. కృష్ణవేణి; పా. శ్యామల; దా. వెం. విఠలజగన్నాథరావు; ని. వెం. రమణమూర్తి; ని. వెం. రామచంద్రరావు; వే. సం. సుబ్రమణ్యం; కర్రా లక్ష్మి; కర్రా సత్యనారాయణ; త్స. అన్నపూర్ణాదేవి; క. నాగేశ్వరరావు; పి. ఎల్. నరసింహులు; ఎ. వి. రమణుడు; తెన్నేటి వేణుగోపాలరావు; న్యా. రాఘవేంద్రరావు; న్యా. గోపాలకృష్ణ; న్యా. భారతీదేవి; వా. గోపాలకృష్ణ; వా. పట్టాభిరామారావు; వా. సుబ్రహ్మణ్యం; స. లక్ష్మీనారాయణ; స. శంకరనారాయణ; స. రామనారాయణ; పు. నరసింహమూర్తి; పు. మోహనకృష్ణ; వే. శీతారామారావు; చిం. మల్లిఖార్జునరావు; బి. ప్రభాకర వెంకటరామమోహనరావు; టి. డి. బాలకృష్ణ; డి. వి. కామేశ్వరరావు; వి. వి. సూర్యనారాయణమూర్తి; జె. వెంకటప్పయ్య; వి. భాస్కర్; ఎమ్. వి. వి. ఎల్. నరసింహం; రా. సత్యవతి; పే. ప్రకాశరావు; ఓ. మల్లిఖార్జున; కా. ప్రభాకర్; గం. వెంకటసుబ్బారావు; గం. బాలకృష్ణ; గం. వెంకటరావు; గం. సూర్యకాంతం; గం. కల్పకం; ప. కామేశ్వరిరావు; మం. సూర్యనారాయణమూర్తి; సంపత్కుమార్; శి. వెంకట శ్రీరామకృష్ణ; శి. ఛాయ మహాలక్ష్మి; భూపాల్ జానకి; హరి; రామ్

భూపాల్; సుధ; కె. సుదేశన్; జె. వి. డి. వి. సత్యనారాయణరావు; జె. శివ కు మార్; వా. భాస్కరరావు; సో. దక్షిణామూర్తి; అం. రవీంద్రరావు; జే. రమణ ప్రసాద్; జె. ఎస్. మణి; జె. రుక్మిణి; ఎస్. పద్మాబాయి; క. గోపాల కృష్ణమూర్తి; వో. అంబుజి.

పిఠాపురం :

క. శేషారత్నం; క, సత్యవతి.

గుంటకల్లు :

మా. భార్గవీదేవి.

భట్టిప్రోలు :

బి. సత్యన్నారాయణ మూర్తి; సి. హెచ్. సుబ్రహ్మణ్యం; వే. రామ కృష్ణారావు;

కోరుకొండ :

ప. అప్పలస్వామి.

తెనాలి :

య. రామశాస్త్రి; య. లక్ష్మీనారాయణ; య. శ్రీనివాసరావు; య. సుబ్రహ్మణ్యం; య. శ్రీకృష్ణ; య. రమా సరస్వతి; సూ. విశాలక్ష్మి; కె. వెంకటేశ్వరరావు; కె. కుమారి వేదవతి.

వాల్తేరు :

అ. సుందరరావు; అ. ఉమాదేవి.

విశాఖపట్నం :

దా. పాండురంగ విఠల్; పి. వి. పాప; మ. నరసింహామూర్తి; య. రామారావు; అ. లక్ష్మీనారాయణ; సూ. స్వ రాజ్య లక్ష్మి; మ. శింగరయ్య; మ. గోపాలకృష్ణ.

సీతానగరం :

బి. వి. వి. ఆర్. సుబ్బారావు.

రాజమండ్రి :

అ. సాంబశివ ప్రసాద శర్మ; ఉ. సన్నయ్య పంతులు; ఉ. వే. గోపాల రావు; ఉ. రామారావు; ఉ. కృష్ణ వేణి; తా. కృష్ణారావు; స. పళ్ళం రాజు; కా. కోటేశ్వరరావు; వ. సత్య నారాయణ రావు; వ. సూర్యదేవర శారద; టి. వి. ఎల్. ఎన్. ఎస్. ఆర్. కె. ఎస్. హెచ్. శర్మ.

కాకినాడ :

బొ. వీరరంగవల్లి కుసుమకుమారి; బొ. వీర వెంకట సత్యనారాయణమూర్తి; మ. సూర్యనారాయణమూర్తి; కె. శ్రీనివాసాచారి; పో. రాజేశ్వరి; పో. శ్రీదేవి; మం. సూర్యప్రకాశరావు; వెంకటేశ్వర్లు; పా. రామకృష్ణారావు.

ముక్త్యాల :

వే. మంజుళ; వే. సరళ.

అనకాపల్లి :

ప. సూరయ్యశెట్టి; వు. లక్ష్మీ నరసమ్మ; వు. నీలాద్రిరావు; వు. కామేశ్వరి; కె. విశ్వనాథము; తా. రామలింగశెట్టి; తా. భారతీదేవి; టి. కామేశ్వరరావు; సూ. స్వరాజ్య లక్ష్మీదేవి; పా. సోమరాజుశెట్టి; వై. వి. సూర్యా

రావు; కే. సీతారాము; కో. సూర్య ప్రకాశరావు; ము. తాండవ కృష్ణా రావు; వు. రామమూర్తి; కొ. కామేశ్వ రమ్మ.

నరసాపూరు ;

పి. ఎల్. నరసింహాచారి.

శ్రీకాకుళం :

గ. సీతారామ జగదానందము; న్యా. బలరామదాసు; న్యా. హనుమా యమ్మ; మం. రంగనాథం; గు. ప్రేమ లత; జి. వి. రత్నమాల; టి. బాలామణి; టి. జయలక్ష్మి.

ఒంగోలు :

తు. ఆంజనేయులు; వి. భానుమతి; క. ప్రమీలా దేవి; బి. బాలకోటిరెడ్డి; క. పి. ఆర్. విఠల్ రావు.

హిందుపురం :

కె. వి. లక్ష్మినారాయణ; కె. ఎస్. లలితమ్మ.

బెంగుళూరు :

వి. హనుమంతరావు; టి. వి. లక్ష్మి నారాయణశెట్టి.

భీమవరము :

న్యా. బాబా; న్యా. హనుమా యమ్మ; కొ. గోవిందరావు.

కాళహస్తి :

కె. కె. రామారావు; పా. కృష్ణ మూర్తిరావు.

బాపట్ల :

ఎ. శేషగిరిరావు; కో. బాలాజీ.

తిరుపతి :

జి. పద్మాదాసు; సి. ఇందిరావతి.

మందసా :

డి. వి. ఎస్. కామేశ్వరరావు.

ఏలూరు :

మం. కామరాజు.

విజయనగరం :

వం. కామేశ్వరి; వం. నరసింహం; బి. టి. ప్రసాదరావు; లం. వెంకా యమ్మ; చి. వరప్రసాద్; పూ. రామావ తారం; మో. కామేశ్వరి; క. పుష్ప వల్లి; టి. శ్యామలాబాయి; ధి. రంగ మణి; ఎ. సూర్యప్రకాశరావు; వి. సీతా మోహనరావు; తె. సత్యనారాయణ మూర్తి; వి. తాయారు; ము. రంగ ధాము; తి. గుణవతీదేవి.

సూళ్ళూరుపేట :

బి. కె. వెంకటాచలం; సి. ఆర్. కృష్ణన్.

వేటపాలెం :

బి. కృష్ణమూర్తి,

అనంతపురం :

ఎన్. పి. హనుమంతరావు; టి. రామ లింగారెడ్డి.

ద్వారపురెడ్డిపాలెం :

దే. వెంకట చంద్రశేఖర రావు: అల్లబుల్ల.

బరంపురం :

జి. శకుంతల; జి. యు. రఘురాం; జి. గోపాలకృష్ణ; జి. శ్రీనివాసరావు; జి. పాండురంగ. ఎ. సూర్యారావు;

హచ్చొళ్ళి (ఆదోని ద్వారా)

టి. సత్యనారాయణ శర్మ; కొ. ప్రేమలీల.

తిలారు :

ఎస్. వి. ఎస్. ఆర్.

గుంటూరు :

క. సేతురామ కృష్ణ సుబ్బారావు; ఎస్. ఎస్. బలరామన్; ఎస్. ఎన్. జగరామన్; రా. మదనగోపాలకృష్ణ; రా. వెంకట శివప్రసాద దీక్షితులు; రా. నరసింహమూర్తి; గం. మల్లిఖార్జున నరసింహదాసు; డి. కృష్ణకుమారి; చం. శ్రీకృష్ణమూర్తి; జి. చలపతి రావు; కె. చలపతిరావు, కొ. వాసుదేవరావు; కె. రామలక్ష్మి; కె. వి. చలపతిరావు; కె. రామశేషు; కె. పార్థసారథి; కె. ఎ. పి. సూర్యప్రకాశరావు; కె. సి. ప్రసాద్; కె. స్వర్ణం; వా. సీతారామారావు; భీ. వెంకట లక్ష్మీనారాయణ రావు.

పాచిపెంట :

బింబో.

హైదరాబాదు :

ఎస్. ఎమ్. రాళ్ళబండి.

కొవ్వలి :

క. మల్లిఖార్జున శర్మ; కె. నాగభద్రేశ్వరరావు; వ. హేమకాత్యాయని.

ద్వారపూడి :

ఐ. వి. సుబ్రహ్మణ్యం.

బెజవాడ :

తం. రామశర్మ; ది. వెంకటేశ్వర్లు; ఎల్. సి. హెచ్. వి. రమణయ్య.

బందరు :

ల. వెంకట ప్రభాకర శర్మ; ల. పద్మావతీదేవి; ల. కోటేశ్వరరావు; ల. వేణుగోపాలరావు; పా. సుందరరావు; సి. సుబ్బారావు; వై. ఈశ్వరమ్మ.

చిలకలపూడి :

సి. వి. ఆర్. శర్మ.

నంద్యాల :

ఎమ్. శకుంతల.

నరశింగాపురము :

పి. శానయ్యశెట్టి.

చంద్రగిరి :

డి. కృష్ణమనాయుడు.

రాయఘుడ (ఒరిస్సా)

కె. వీరరాఘవరావు కుమందాన్.

బారువా :

సి. రమాతులశి.

చాగల్లు :

గ. రంగారావు.

బొంబాయి :

ప. కామేశ్వరి.

సాలిహుండాం :
జి. విజయ భాస్కరరావునాయుడు.
పీనపాళ్ళ :
పె. కృష్ణప్రసాద్‌బాబు.
ఢిల్లీ :
అయ్యాగారి లక్ష్మి.
వేలూరు :
ఎన్. జానకీరాయన్.
చీరాల :
కా. వెంకట మల్లిఖార్జునరావు.
బూరవెల్లి :
ఆ. లక్ష్మీనారాయణాచార్యులు.
ధవళేశ్వరం :
సి. భానుమూర్తి.
గూడూరు :
తోట రామయ్య.
—కురుమద్దాలి గాయిత్రీదేవి.



బి॥ బచ్చు సరోజినిదేవి
(విజయనగరం)

వయసు 7 సం॥ ఎంత బాగా నవ్వగలదో అంత బాగా పాడగలదు. త్యాగరాయకీర్తనలు అన్నీ అప్పుడే వచ్చును. ఎవరు ఏ పాట పాడినా, రాగం, తాళం తప్పకుండా ఆ పాటను హార్మోనియంతో కలిపి వాయించగలదు.

## దశరథుని కొడుకులు

గురువు:—రామూ! దశరథునికి ఎందరు కొడుకులు?
రాము:—నలుగురు.
గురువు:—సోమూ! ఆ నలుగురుని వరుసగా చెప్పుము.
సోము:—ఒకటోవాడు, రెండోవాడు, మూడోవాడు, నాలుగోవాడు.


సంపాదన : భావరాజు వెంకట సీతా రామారావు.
కేసరీ స్కూలు, మద్రాసు.

# "బాల" ను చూడగానే

"అందుకోమ్మా బాల! ఆశీస్సు లివిగో
అంది మమ్మెల్లర నానందపఱుపు
చిన్నారి పొన్నారి చిట్టివగు నిన్ను
కన్నులారగ 'నిన్న' గాంచితిని బాల!
కన్నది మొదలుగా కడుపులో నేమొ
నిన్ను దీవింపంగ నిచ్ఛపుట్టింది
పుట్టిన వెంటనే పట్టితిని కలము
పట్టి నీ కాశీస్సు ముట్టజెప్పితిని
చిన్న బాలురగూడి చిర్నగవుతోడ
పన్నుగా ప్రతియింట పాడి యాడెదవు
నెలకొక మారు నీ నెనరైన మోము
బాలురకున్మాకు గన్పడ్తువీవు
వస్తోంది సంక్రాంతి వస్తోంది బాల!
ముస్తాబుతో వచ్చి మురిపింపు మమ్ము."

రచయిత: "శంకరప్రసాద్" తిరుపతి.

## అంకెల బొమ్మ



## చందాదారులకు మనవి!

'బాల' సంక్రాంతి సంచిక, చక్కని అచ్చుతో, బొమ్మలతో, కథలతో, వస్తుంది. వెల 12 అణాలు మాత్రమే. కాని, సంవత్సరం చందాదారులకు మాత్రము ఉచితముగా పంపుతాము. మీ కాపీలు మధ్య పోస్టులో పోకుండా, మీకు తప్పకుండా చేరాలిఅంటే మీరు 3 అణాలు పంపవలెను. మీ సంచిక రిజిష్టరుచేసి పంపుతాము.




# ఫో టో పో టీ

★

## (ఫో టో అ న్న య్య)

ఈ దిగువ బొమ్మ చూచారా? అందులో ఏమిటి వుందో జాగ్రత్తగా చూడండి. ఈ బొమ్మలో పిల్లలు ఏమి చేస్తున్నారో ఆ సంగతంతా ఊహించి నేను ఒక వ్యాసం వ్రాశాను. మీరుకూడా యీ బొమ్మలోని విషయాల గురించి వ్యాసం రాయండి. నేను రాసిన ఊహలతో, మీరా రాసిన ఊహలు ఒకటైతే మీకు పూర్తి మార్కులు. మీరు పంపిన వ్యాసాలు పరీక్ష చేసి మార్కులు ఇస్తాను.



మీ వ్యాసాలు మాకు డిశంబరు 25 వ తేదీ లోపుగా అందాలి. మీ ఉత్తరం కవరు మీద

"ఫో టో అ న్న య్య"

c/o "బాల", మైలాపూరు, మదరాసు. అని రాయండి.




# పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

డిసెంబరు తే 1—31 వరకు.

[211 మీటర్లు, 41,36 మీటర్లమీదా వినొచ్చు.]

### 2 వ తేది ఆదివారం.

మధ్యాహ్నం 2-10 నుంచి 3 వరకు.

పిల్లల సరదాప్రోగ్రాం: పిలుపుపాట; ఉత్తరాలసంచి; అప్పుడు, ఇప్పుడు—నాటిక; పుట్టినరోజులు; చిటికెనవేలు-పాట; మెలికిమాట; తాతయ్యకథ; మల్లెపందిరి-పాట; చిక్కుకథ; మీరు పంపినకథలు, నాటికలు; సెలవుపాట.

### 4 వ తేది మంగళవారం.

సాయంత్రం 4-30 నుంచి 5 వరకు.

బడిపిల్లలకు: ఇటికెలు, వడ్రింగిపని; ఆశ్లేష నక్షత్రమును గురించి ప్రసంగం.

### 6 వ తేది గురువారం.

మధ్యాహ్నం 3 నుంచి 3-30 వరకు.

హైస్కూలు పిల్లలకు: నన్నయభట్టు — ప్రసంగం; నన్నయభట్టు కావ్యపఠనం.

### 7 వ తేది శుక్రవారం.

సాయంకాలం 4-30 నుంచి 5వరకు.

బడిపిల్లలకు: మాజిస్ట్రేటుని గురించి ప్రసంగం.

### 9 వ తేది ఆదివారం.

మధ్యాహ్నం 2-10 నుంచి 3 వరకు.

పిల్లల సరదాప్రోగ్రాం: పిలుపుపాట; ఉత్తరాలసంచి; పాలరాయి—నాటిక; పుట్టినరోజులు; కోతిమూతి-చిన్నకథ; రైలుబండిపాట; చిక్కుప్రశ్న; మెలికిమాట; మాపాట్టిబావ-పాటకథ. మీరు పంపిన కథలు, నాటికలు; సెలవుపాట.

## 11 వ తేది మంగళవారం.

సాయంత్రం 4-30 నుంచి 5 వరకు. బడిపిల్లలకు: ఇల్లుకట్టుకొనుట - ప్రసంగము; రోలండు, ఆలివరులను గురించి ప్రసంగం.

## 13 వ తేది గురువారం.

మధ్యాహ్నం 3 నుంచి 3-30 వరకు. హైస్కూలు పిల్లలకు: రాజేంద్రుని గురించి ప్రసంగం; సూర్యుని తేజస్సు గురించి ప్రసంగం.

## 14 వ తేది శుక్రవారం.

సాయంకాలం 4-30 నుంచి 5వరకు. బడిపిల్లలకు: మంటలు ఆర్పే బండిని గురించి ప్రసంగం.

## 16 వ తేది ఆదివారం.

మధ్యాహ్నం 2-10 నుంచి 3 వరకు. పిల్లల సరదాప్రోగ్రాం: పిలుపుపాట; ఉత్తరాలసంచి; నెమిలిరాజు-నాటిక; పుట్టినరోజులు; నా పిల్లలు బంగారు కొండలు-నాటిక; జేజమామయ్యపాట; చిక్కుప్రశ్న; భూతద్దము; ఒక తమాషా; మీరు పంపిన కథలు, నాటికలు; సెలవుపాట.

## 18 వ తేది మంగళవారం.

సాయంత్రం 4-30 నుంచి 5 వరకు. బడిపిల్లలకు: ఇంటిని అలంకరించుట. ప్రసంగం; భరణినక్షత్రం—ప్రసంగం.

## 20 వ తేది గురువారం.

మధ్యాహ్నం 3 నుంచి 3-30 వరకు. హైస్కూలు పిల్లలకు: మంచి ఇల్లు—ప్రసంగం; సర్ గలహాడ్ ని గురించి ప్రసంగం.

## 21 వ తేది శుక్రవారం.

సాయంకాలం 4-30 నుంచి 5 వరకు. బడిపిల్లలకు: ప్రయాణసౌకర్యములు ప్రసంగం.

## 23 వ తేది ఆదివారం.


మధ్యాహ్నం 2-10 నుంచి 3 వరకు. పిల్లల సరదాప్రోగ్రాం: పిలుపుపాట-ఉత్తరాలసంచి; గాయకశిఖామణులు; నాటిక; పుట్టినరోజులు; తాతయ్య ముచ్చట్లు; చలిచలిమచాక్కా-పాట; క్రిస్మిస్ సెలవులు, నాటిక; మెలికి మాటపోటీ; అవీ ఇవీ అన్నినీ; సెలవు పాట.

## 30 వ తేది ఆదివారం.

మధ్యాహ్నం 2-10 నుంచి 3 వరకు. పిల్లల సరదాప్రోగ్రాం: పిలుపుపాట; ఉత్తరాలసంచి; గారడివాడు-నాటిక; పుట్టినరోజులు; తమ్ముడితో క్రికెట్టుకి; పోతుంది పోతుంది పాతయేడాది; అవీ ఇవీ అన్నీని; చిక్కుప్రశ్న; వింతలు, వినోదాలు; సెలవుపాట.

తెలుగు తెరకొక మకుటాయమాన చారిత్రక చిత్రం!

శ్రీ శారదా ప్రొడక్షన్సు వారి




డైరెక్టర్....జి. రామబ్రహ్మం

యుద్ధరంగంలో తమ వేడిరక్తాన్ని చిలికించి ఆంధ్ర వీర చరిత్రకు జీవంపోసిన పల్నాటియోధుల అమృతేతిహాసం!

మాటలు, పాటలు : సముద్రాల

గానము : పెంచలయ్య.

తారాగణం:

కన్నాంబ, డాక్టర్ జి. వి. సుబ్బారావు, నాగేశ్వరరావు, ఇంకా సుప్రసిద్ధులు.

*For Particulars:*

SRI SARADA PRODUCTIONS

6, POES ROAD, TEYNAMPET, MADRAS.

Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore.

# "BALA" . . SPECIAL

*for*

## SANKRANTI

"**BALA**", the Beautiful will come out decorated with colourful pictures, skits, playlets, short stories, rhymes, photos and tit-bits to greet you for Sankranti in January.

**Hurry up Children!** Register your copy beforehand!

**Hurry up Parents!** Lest your children should miss the Special!

**Hurry up Advertisers!** Lest you should miss the best medium of publicity of your products through BALA, the pet child of four crores of Andhras!

**SINGLE COPY AS. 12**

*By Registered Post As. 3 extra.*

**Manager: "BALA"**

**20, Sundareswar Street : MYLAPORE : MADRAS**


సంక్రాంతి వినోదానికి
సహృదయలోకానికి
చలనచిత్రకావ్యసమర్పణోత్సవము
జనవరి
10వ తేదిన
బెజవాడ · గుంటూరు · నెల్లూరు
రాజమండ్రి · కాకినాడ · మచిలిపట్నం
కర్నూలు · విజయనగరం · గదగ్
కాలికట్ · ఎర్నాకులం
తదితరనగరాలలో
స్వీకరించండి
వాహినీ వారి
స్వర్గసీమ
Directed by B.N.REDDI
CAMERA..BARTLEY...... SOUND...DINSHAW....... ART....NAGOOR...... STUDIO...NEWTONE